# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త



## కొండలరాయునికి కొండంత వేడుక!

### బ్రహ్మోత్సవ సంరంభంలో ఆకట్టుకుంటున్న కళాకృతులు

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

కొండలలో నెలకొన్న కోనేటిరాయుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి బ్రహ్మోత్సవ సంరంభం ఆరంభమవుతోంది. తిరుమలను కలియుగవైకుంఠంగా కళ్ళకు కట్టినట్లు అద్భుతంగా తీర్చిదిద్దారు.ఆలయం పైభాగాన, పరిసరాల్లో,కల్యాణవేదిక ఉద్యానవనం ప్రాంతాల్లో పలు రకాల కళాకృతులు, ఫల,పుష్ప కళాకృతులు తీర్చిదిద్దారు. స్వామివారి చెంత అందరూ సేవకులమేనంటూ ఆనందపరవశులవుతున్నారు. భక్తులు భక్తిభావంతో తన్మయత్వం చెందేలా ఏడుకొండలవాడా వడ్డీకాసుల స్వామీ గోవిందా...గోవింద అంటూ ఏర్పాట్లు అద్భుతంగా వున్నాయి.

# మహాళయ అమావాస్యకు భక్తుల సందడి



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 21 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఆదివారం వారాంతపు రద్దీతో పాటు మహాళయ అమావాస్య సందర్భంగా రద్దీ విపరీతంగా పెరిగింది. ఎటు చూసినా భక్త జనమే అన్నట్లుమారింది.శాఖల మధ్య సమన్వయ లోపంతో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. తర్పణాలు వదలటానికి కదలి రావటంతో రద్దీ చోటు చేసుకుంది. ఓ వైపు కాలినడకన వచ్చే భక్తులు మరో వైపు వాహనాల రద్దీతో కిట కిటలాడింది. ఆది వారం అధికారికంగా దేవస్థానం జారి చేసిన సమాచారం మేరకు 25 వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నట్లు తెలిపారు.రాహుకేతుదోష నివారణ పూజలకు కూడా సుమారు 7వేలు దాటాయి.. శ్రీకాళ హస్తీశ్వరాలయానికి వారాంతంలో తమిళనాడు, కర్నాటకలకు చెందిన భక్తుల సంఖ్య అదికంగా ఉం టుంది. అలాగే వివిపిలతాకిడి కూడా అధికంగానే ఉంటుంది. దూర ప్రాంతాల నుంచి దేవస్థానం వసతి గృహాలు ఉన్నాయనే భక్తుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఆదివారం రూ.200 దర్శనం టిక్కెట్లుతో 2683 మంది, రూ.50ల దర్శనం టిక్కెట్లులో 2470 మంది రాప ుకేతుదోష నివారణ పూజలకు సంబంధించి రూ.500లు టిక్కెట్లు 3823 మంది, రూ.750టిక్కెట్లతో 1695, రూ.1500 టిక్కెట్లు కొనుగోలు చేసిన 504 మంది భక్తులు రూ.2500ల టిక్కెట్లు కొనుగోలు చేసి 376 మంది, రూ.5వేల టిక్కెట్లు 154 కొనుగోలు చేసి పూజలు జరిపించుకున్నారు.

## తర్పాణాలు సమర్పించటానికి తిప్పలు

### స్నానాలకై నిరీక్షణ

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 21 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో అమావాస్య సందర్భంగా పండగ దినాల్లో,మహాళయ అమావాస్య సందర్భంగా పితృదేవతలకు తర్పణాలు వదలటం ఆనవాయితి. ఈ మేరకు ఆ రోజుల్లో సన్నిధివీధి లోని స్వర్ణముఖి నది వద్దన బ్రాహ్మణులకు దానాలు ఇవ్వటం, అలాగే తర్పణాలు వదలటానికి చర్యలు తీసుకుంటారు. ఈ సారి భద్రత పేరుతో కర్మక్రియల మండపంలోకి మార్చారు. చిన్న స్థలంలో నిర్వహణకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు.ఇక తర్పణాలు వదలిన తరువాత స్నానాలు చేయటానికి ప్రజలు పడ్డ ఇబ్బందులు వర్ణనాతీతంగా మారింది.శనివారం ఉదయం నుంచి స్థానికులు దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఎక్కడ తర్పణాలు వదలాలో తెలియని స్థితి చోటు చేసుకుంది. దేవస్థానం ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేసారు కానీ తర్పణాలు వదలిపెట్టె చోట ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవటంతో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.

మహాళయ అమావాస్య రద్దీ . . .

మహాళయ అమావాస్య సందర్భంగా రద్దీ ఏర్పడింది. ఉదయం నుంచి తర్పణాలు వదలటానికి చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా రాష్ట్రనలుమూలల నుంచి భక్తులు తండోపతండాలుగా కదలి వచ్చారు.గతంలో సన్నిధి వీధిలోని స్వర్ణముఖి తీరాన పూజలు జరిపి తర్పాణాలు వదిలేవారు.కానీ ఈ సారి పోలీసులు భద్రత దృష్ట్యా వీధిలో తర్పాణాల పూజలకు అనుమతించలేదు. సన్నిధివీధిలోని కర్మక్రియల మండపంలో అవకాశం కల్పించారు. వేలాది మంది రాగా కేవలం పది మందికి కూడా సరిపోని భవనంలో అవకాశం కల్పించటంతో వచ్చి వారు పడ్డ ఇబ్బంది వర్ణనాతీతంగా మారింది. ఇక తర్పణాలు వదలటానికి వచ్చిన వారు స్నానమాచరించటానికి స్నాన ఘట్టాల వద్దకు వెళ్ళటానికి ఇబ్బంది పడ్డారు.వందలాది మంది తమ పితృదేవతలకు తర్పణాలు సమర్పించారు.తరువాతస్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.



స్వర్ణముఖి నదిలో పూజలుచేస్తున్న దృశ్యం

## వైభవంగా జెండా మహోత్సవం



గూడూరు, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త

ప్రతి ఏటా నవరాత్రులు ముందు గూడూరు పట్టణంలో వైభవంగా జెండా పండుగ నిర్వహిస్తారు. ఆది వారం మహాళయ అమావాస్య సందర్భంగా శ్రీ ఆంజనేయ స్వామి వారి జెండా ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి వారి చిత్రపటాన్ని ఉత్సవ కమిటి నిర్వాహకులు వారి వారి వీధుల్లో మంగళ వాయిద్యాలు, తెనాలి బ్యాండ్లతో ఊరేగించారు. ప్రత్యేకంగా అలఘనాధ స్వామి దేవాలయం జెండా తూర్పు వీధి, కర్నాల వీధి, కోనేటి మిట్ట, గమళ్ల పాలెం, నల్లజాలమ్మ విధి కుమ్మరి వీధి, చాకలి వీధి విగ్నేశ్వరపురం ఐసిఎస్ రోడ్డు గాంధీనగర్ ఇందిరానగర్ రాణి పేట ఏరియాలో వైభవంగా నిర్వహించారు. ఈ ఏరియాలోనే కాకుండా గూడూరు నలుమూలల ఆంజనేయస్వామి జెండా ఊరేగింపు నిర్వహించారు. విద్యుత్ దీపంలంకరణలు మిరుమిట్లు గోలిపాయి. ఆర్టీసీ వద్ద ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ యువతను ఆకట్టుకున్నాయి. ప్రశాంతంగా జెండా పండుగ జరిగింది. బేతల వేషాలు, మహిషాసురుడు పార్వతి వివిధ రూపాల అమ్మవారి వేషాలు, బ్యాండు మేళాలు, తప్పెట్లు బాణా సంచాలు వీధుల్లో ఆర్కెస్టాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం రాష్ట్ర నలుమూలల నుండి ప్రజలు విచ్చేశారు.

## స్వర్ణ నారావారి పల్లెకు స్కోచ్ గోల్డెన్ అవార్డు

### - ప్రజలు, అధికారులను అభినందించిన సీఎం నారా చంద్రబాబు

తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త



స్వర్ణ నారావారిపల్లె ప్రాజెక్టు ప్రతిష్టాత్మక స్కోచ్ గోల్డెన్ అవార్డును సాధించింది. ప్రతి ఇంటికి సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకున్న గ్రామంగా ఈ అవార్డు దక్కించుకుంది. కేవలం 45 రోజుల వ్యవధిలోనే మొత్తం 1600 ఇళ్ళకు సోలార్ రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ వెలుగులు నింపారు. కర్బన ఉద్గారాల తగ్గింపులో భాగంగా హరిత స్వర్ణాంధ్ర లక్ష్యంగా ప్రారంభించిన ఈ ప్రాజెక్టులో ఉచితంగా ప్రతి ఇంటికి సోలార్ రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేశారు. మొత్తం 3396 కిలోవాట్ల సామర్థ్యంతో ఏడాదికి 4.89 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కానుంది. రూ.3.39 కోట్ల రూపాయల విద్యుత్ సోలార్ రూఫ్ టాప్ ద్వారా ఉత్పత్తి కానుంది. ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజనలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తగా స్వర్ణ నారావారిపల్లె ప్రాజెక్టు ద్వారా సౌరశక్తి ఫ్యానెళ్ళను ప్రతి ఇంటిపైనా ఉచితంగా ఏర్పాటు చేశాయి. అన్ని ఇళ్ళకూ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసి మొత్తం గ్రీన్ ఎనర్జీని వినియోగిస్తున్న తొలి గ్రామంగా ప్రతిష్టాత్మకంగా సంస్థ స్కోచ్ గోల్డెన్ అవార్డును ప్రకటించింది. తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్, ఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర నాయుడు అవార్డును ఢిల్లీలో అందుకున్నారు. దీనిపై సీఎం నారా చంద్రబాబు నాయుడు ఎక్స్ వేదికగా గ్రామానికి శుభాకాంక్షలు తెలిపారు.

# సబ్సిడీ రుణం కోసం 6 నెలలుగా బిసీలు పడిగాపులు

### - మెగా చెక్కులు ఇచ్చి చేతులు దులుపుకున్న ప్రజాప్రతినిధులు, అధికారులు
### - బ్యాంకుల చుట్టూ లబ్దిదారులు ప్రదక్షిణలు

చిత్తూరు, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:

సబ్సిడీ రుణాల కోసం 6 నెలలుగా బీసీలు నిరీక్షిస్తున్నారు. సబ్సిడీ రుణాలు మంజూరు చేశామని బీసీ లబ్దిదారులను పిలిచి గొప్పగా మెగా చెక్కులు పంపిణీ చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఆపై విస్మరించారు. బీసీ సబ్సిడీ రుణం మంజూరైందని ఆశగా బ్యాంకులకు వెళ్ళిన లబ్దిదారులకు రుణం లేదు గిణం లేదంటూ బ్యాంకు అధికారులు ఇసడించుకోవడంతో వారు ఖంగు తినాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో గతంలో ఐదేళ్ళ పాటు అధికారం చెలాయించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయలేదు. రాష్ట్రంలో ఒకటిన్నర ఏడాది క్రితం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం గతంలోని వైకాపా ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయకుండా మోసం చేసిందని, తమ ప్రభుత్వం ఎంపిక చేసిన లబ్దిదారులకు స్వయం ఉపాధి పొందడానికి అవసరమైన మేరకు సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తామని చెప్పి లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టింది. ఈ మేరకు ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల మంజూరుకు అర్హులైన వారి నుండి దరఖాస్తులు ఆహ్వానించారు. ఈ మేరకు మున్సిపాల్టీలు, మండలాల స్థాయిలో అధికారులు, బ్యాంకర్లు కలిసి సబ్సిడీ రుణం కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి లబ్దిదారుల జాబితాను సిద్ధం చేశారు. ఈ మేరకు బ్యాంకర్లు ఎంపిక చేసిన లబ్దిదారుల జాబితాను అధికారులు బీసీ కార్పొరేషన్‌కు పంపగా కార్పొరేషన్ అధికారులు ఆ జాబితాను బ్యాంకులకు పంపి ఎంపికైన వారందరికీ సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని మార్గదర్శకాలు జారీ చేసింది. బిసి కార్పొరేషన్ ద్వారా బ్యాంకులకు లబ్దిదారుల జాబితా చేరడంతో ఇక సబ్సిడీ రుణం చేతికి అందినట్లేనని భావించిన లబ్దిదారులు సంబరపడ్డారు. ఈ క్రమంలో ఏప్రిల్ 11వ తేదీ డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా బీసీ సబ్సిడీ రుణాలకు ఎంపిక చేసిన లబ్దిదారులందరినీ చిత్తూరు బీసీ భవన్‌లో జరిగిన సభలో జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు మెగా చెక్కులు పంపిణీ చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి బీసీ సబ్సిడీ రుణాలకు సంబంధించి మెగా చెక్కులు పంపిణీ చేయడం, బీసీ కార్పొరేషన్ నుండి బ్యాంకులకు లబ్దిదారుల జాబితా అందడంతో ఇక సబ్సిడీ రుణాల గ్రౌండింగ్ ప్రక్రియ ప్రారంభమైనట్లేనని లబ్దిదారులు ఆశ పడ్డారు. అయితే వారం పది రోజులైనా బ్యాంకులు బీసీ సబ్సిడీ రుణాల గ్రౌండింగ్ ప్రక్రియ చేపట్టకపోవడంతో రుణాలు మంజూరైన లబ్దిదారులు బ్యాంకులకు వెళ్ళి తమకు బీసీ సబ్సిడీ రుణం మంజూరు చేసి బాబు జగ్జీవన్‌రామ్ జయంతి పురస్కరించుకుని మెగా చెక్కు అందజేశారని సబ్సిడీ రుణం గ్రౌండింగ్ చేయాలని కోరారు. అయితే బ్యాంకు అధికారుల నుండి లబ్దిదారులకు దిమ్మె తిరిగే సమాధానం ఎదురైంది. బీసీ కార్పొరేషన్ నుండి లబ్దిదారులు జాబితా బ్యాంకులకు అందిందని, అయితే సబ్సిడీ రుణాల గ్రౌండింగ్‌పై ప్రభుత్వం నుండి తమకు స్పష్టత రాలేదని, అలాగే ప్రభుత్వం ఈ సారి ముందుగానే అడ్వాన్స్‌డ్ సబ్సిడీ విడుదల చేస్తోందని చెప్పిందని, ఆ మేరకు ప్రభుత్వం నుండి ఇప్పటి వరకు అడ్వాన్స్‌డ్ సబ్సిడీ విడుదల కాకపోవడంతో ఇప్పట్లో ఎంపికైన లబ్దిదారులకు బీసీ సబ్సిడీ రుణాలు గ్రౌండింగ్ చేసే అవకాశం లేదని బ్యాంకు అధికారులు స్పష్టం చేశారు. దీంతో బీసీ సబ్సిడీ రుణాలు ఇక చేతికి అందడమే తరువాయి అని భావించిన లబ్దిదారుల గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లు అయ్యింది. బీసీ సబ్సిడీ రుణం మంజూరు కావడంతో రుణం ఇప్పుడు వస్తుంది! అప్పుడు వస్తుంది! అని ఆశలు పెట్టుకున్న లబ్దిదారులకు మెగా చెక్కులు ఇచ్చి ఆరు నెలలు కావస్తున్నప్పటికీ బ్యాంకులు ఇప్పటికీ బీసీ సబ్సిడీ రుణ యూనిట్ గ్రౌండ్ చేయకపోవడంతో లబ్దిదారుల్లో తీవ్ర నిరాశ నెలకొంది. గతంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టంగా బీసీ సబ్సిడీ రుణాలు ఇవ్వడం లేదని దానికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ పథకాలు లబ్దిదారులకు అందిస్తామని పేర్కొని తాము సబ్సిడీ రుణాలు ఇవ్వడం లేదని తన విధానంను స్పష్టం చేసిందని లబ్దిదారులు పేర్కొంటున్నారు. ఈ కూటమి ప్రభుత్వం గత వైకాపా ప్రభుత్వం తరహాలో కాకుండా ఎంపిక చేసిన లబ్దిదారులందరికీ సబ్సిడీ బీసీ రుణ యూనిట్లు గ్రౌండింగ్ చేస్తామని హామీ ఇచ్చి అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి లబ్దిదారులను ఎంపిక చేసి బ్యాంకుల వరకు జాబితా పంపి ఆరు నెలలుగా రుణాలు గ్రౌండింగ్ చేయకుండా నిట్ట నిలువున మోసం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## భూమన...ఫేక్ ప్రచారం వద్దు... జైలుకు పోవడం ఖాయం

### డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం

తిరుపతి హెల్త్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త :

టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి నీవు టీటీడీపై చేసేవి అన్నీ ఫేక్ ప్రచారాలు..అవి మానుకో త్వరలో నీవు జైలుకు పోవడం ఖాయం అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీ హయాంలోనే రవికుమార్ అనే వ్యక్తి రూ.వేలాది కోట్లు దేవుడి హుండీ సొమ్మును దోచుకోవడం కోవడం జరిగిందన్నారు. అతన్ని కోర్టులో నిలబెట్టి జైలుకు పంపాల్సింది పోయి అతనిఆస్తులను బినామీ పేర్లతో రాయిం



చుకుని లోక్‌అదాలత్‌లో కేసులు కొట్టించి వేయడం విడ్డూరంగా ఉందన్నారు. రవి కుమార్ అనే వ్యక్తి ఎక్కడ ఉన్నాడో తెలియజెప్పాల్సిన బాధ్యత నీపై ఉందన్నారు. హుండీ కుంభకోణం కేసులు అప్పటి ఈవో ధర్మారెడ్డి, నీవు, మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ముగ్గురు కుమ్మక్కై ఈ త తాంగాన్ని అంతా నడిపించడం జరిగిందన్నారు. స్వామివారే నీకు తగిన శాస్తి చేస్తారన్నారు. అనంతరం టీడీపీ తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి పెరుమాళ్ మధు మాట్లాడుతూ సీఎం నారా చంద్రబాబు, మంత్రి లోకేష్‌బాబును మాట్లాడే అర్హత మీకు లేదన్నారు. నీవు, నీ కుమారుడు ఇద్దరూ కలిసి యువతను పెడదారి పట్టించడం దారుణమన్నారు. మా నారా లోకేష్ త్వరలో మీకు తగిన బుద్ధి చెప్పి జైలుకు పంపే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. నారా లోకేష్‌ను జ్ఞాన శూని అన్న నీకు రాజకీయ శూన్యం చేస్తామని పెరుమాళ్ మధుబాబు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుల్లెట్ రమణ, ఆయా వార్డుల అధ్యక్షులు మునికుమార్, విజయలక్ష్మి, నాగరాజు, ఆనంద్ యాదవ్, కోటేశ్వరరావు, రామచంద్రయ్య, నందు, టీడీపీ నేతలు, యువ నేతలు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలపై గట్టి నిఘా

### - జిల్లా ఎస్పీ తుషార్ దూడి



కుప్పం డిఎస్పీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్ దూడి

కుప్పం, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త

కుప్పం సబ్ డివిజన్ పరిధిలో అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై గట్టి నిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ తుషార్ దూడి ఆదేశించారు.ఆదివారం ఆయన కుప్పం డిఎస్పీ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా వివిధ కేసులకు సంబంధించి రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కుప్పం సబ్ డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అల్లర్లు, గొడవలకు చోటుండరాదన్నారు. విజిబుల్ పోలీసింగ్ ప్రతిరోజూ నిర్వహించాలన్నారు. పోలీసు శాఖ గంజాయి, మత్తు పదార్థాలపై నిఘా ఉంచి అరికట్టాలని ఆదేశించారు. మహిళల భద్రత విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చోరీలకు అడ్డుకట్ట వేస్తూనే మరో పక్క ఇదివరకే జరిగిన చోరీలకు సంబంధించి రికవరీలు పెంచాలన్నారు. యుఐ కేసులు, అనుమానాస్పద మృతుల కేసులను జాప్యం లేకుండా పరిష్కారం చూపాలన్నారు. రోడ్డు భద్రత నియమాల ఉల్లంఘనపై మరింత కఠినంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డిఎస్పీ పార్థసారథి, అర్బన్ సిఐ శంకరయ్య పాల్గొన్నారు.

# అనర్హుడికి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి !?

### నియోజకవర్గ వ్యాప్తంగా భగ్గుమంటున్న కూటమి కేడర్..!

గంగవరం,సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :

గతంలో వైసిపితో చెట్టపట్టాలేసుకుని తిరిగిన ఓ వ్యక్తికి పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కట్టబెట్టడంపై టిడిపితోబాటు కూటమిపార్టీల శ్రేణులు భగ్గుమంటున్నాయి. మొన్నటివరకు ఆయన టిడిపికి ఒరగబెట్టిందేమీ లేదని, ఇప్పుడు ఏకంగా మార్కెట్ కమిటీ పగ్గాలు ఇవ్వడమేంటనే నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఇదీ కూటమిప్రభుత్వంలో పదవులు పందేరంతో ఆ పార్టీల్లో తీవ్రస్థాయిలో విమర్శలు అసంతృప్తులు తెరపైకి వస్తున్నాయి. పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని గంగవరం మండలం గండ్రాజుపల్లె పంచాయతీ ఆలకుప్పం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి ఇచ్చారు. ఈ వ్యవహారంతో నియోజకవర్గవ్యాప్తంగా పార్టీ శ్రేణులు తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. పెద్దగా ప్రజాదరణ లేని అతనికి ,పార్టీ



బలోపేతానికి ఏమాత్రం ఉపయోగపడని,ఇప్పటి వరకు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పంచాయతీలో టీడీపీకి కనీసం మెజార్టీ ఇవ్వలేని అతను ఆ పదవికి ఎలా అర్హుడంటూ టిడిపి వర్గాలు విమర్శలు చేస్తున్నాయి.గత వైసీపీ ప్రభుత్వంలో వైసీపీ నాయకులతో అంటకాగి మట్టి దందాతో కోట్లు గడించిన అతనికి కూటమిలో కీలక పదవులు ఎలా ప్రకటిస్తారంటూ సొంత పార్టీ నాయకులే బహిరంగగానే విమర్శిస్తున్నారు. ప్రజా శ్రేయస్సుకు,కూటమి ప్రభుత్వానికి హాని కలిగించే చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే అసాంఘీక శ(వ్య)క్తులు ప్రస్తుతం పాలకుల పంచన చేరడాన్ని కేడర్ జీర్ణించుకోలేక పోతోంది. తమ కష్టానికి తగ్గట్టుగానే పదవుల్లో నామినేట్ చేస్తారని ఆశలు పెంచుకున్న వారిలో గండ్రాజుపల్లె చెందిన బత్తిగౌడు,ప్రముఖ సీనియర్ న్యాయవాది పలమనేరు బార్ అసోషియేషన్ అధ్యక్షుడు ఎల్.భాస్కర్,పలమనేరు పట్టణంకు చెందిన బ్రహ్మయ్య,గంగవరం,వికోట మండలాల మాజీ జడ్పీటీసీలు సోమశేఖర్‌గౌడు,చౌడప్ప,పలమనేరు నియోజకవర్గ టీడీపీ మహిళ ఉపాధ్యక్షురాలు శివకుమారి,పెద్దపంజాణి మాజీ మండలాధ్యక్షుడు నాగరాజు,సీనియర్ నాయకులు స్వతంత్రబాబు,చలపతి, సుబ్రమణ్యంశెట్టి, నాగభూషణం, సెల్వరాజ్,ఈశ్వర్‌గౌడు,గంగప్పలతో పాటు మరో వైపు జనసేన,బీజేపీ పక్షాన నుంచి కూడా భారీగానే ఆశావాహులు ఉన్నారు. పలమనేరు నియోజకవర్గ పరిస్థితులపై ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, మంత్రి లోకేష్‌కు ఒక ప్రధాన సామాజిక వర్గం ఎప్పటికప్పుడు సమాచారం చేరవేస్తున్నట్లు తెలిసింది.




## ప్రగతి పథంలో పలమనేరు సూపర్‌బజార్ : అధ్యక్షుడు ఆర్‌వి బాలాజీ

**పలమనేరు, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:** పలమనేరు బాలాజీ కో ఆపరేటివ్ సూపర్‌బజార్ దినదినాభివృద్ధి చెందుతూ ప్రగతిపథంతో దూసుకు పోతోందని సూపర్‌బజార్ అధ్యక్షుడు ఆర్‌వి బాలాజీ అన్నారు. ఆదివారం స్థానిక సూపర్‌బజార్ ఆవరణలో జరిగిన 51వ వార్షికోత్సవ సర్వజన మహాసభలో ఆయన మాట్లాడుతూ కేవలం 42 మంది సభ్యులతో ప్రారంభమైన సూపర్ బజార్ నేడు అంచెలంచెలుగా ఎదిగి నేడు 14.500 మంది సభ్యులతో అలరారుతోందని వివరించారు. గత ఏడాది 24.75 కోట్ల అమ్మకాలు జరుగగా ఈ సారి మరో రెండు కోట్ల అమ్మకాలు అధికంగా జరిగాయన్నారు. ఇదంతా డైరెక్టర్లు, వినియోగదారుల సహాయ సహకారాల వల్లనే అని కొనియాడారు. కేవలం 5 నుండి 6 శాతం లాభాలతో అమ్మకాలు జరుపుతూ కేవలం వినియోగ దారుల సంక్షేమమే ధ్యేయంగా సూపర్‌బజార్ నడుస్తోందని తెలిపారు. ఈ లాభాలు కూడా సూపర్ బజార్ లో పనిచేసే ఉద్యోగుల జీత భత్యాలు, విద్యుత్ చార్జీలు ఇతర ఖర్చుల కోసం మాత్రమే నని వివరించారు. ఈ సందర్భంగా 2025 -2026 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. డైరెక్టర్లు, సంస్థ సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

## స్పెషల్ కెపాసిటీ బిల్డింగ్ కోర్సుకు ధరఖాస్తులు

**చిత్తూరురూరల్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ పాటియాలా ద్వారా నిర్వహిస్తున్నట్లు స్పెషల్ కెపాసిటీ బిల్డింగ్‌కోర్సుకు ఈనెల 25వ తేదిలోపు ధరఖాస్తులు చేసుకోవచ్చునని డిఎస్‌డిఓ బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో స్పోర్ట్స్ కోటా కింద పనిచేసే క్రీడాకారుల నైపుణ్యాలు, వృత్తిపరమైన సామర్థ్యాలను పెంపొందించడానికి ఒక ఫ్లెక్సి బుల్ ప్రోగ్రాంగా రూపొందించబడిందన్నారు, ఎటువంటి ప్రామాణిక, దీర్ఘకాలిక సెలవు అవసరం లేకుండా కోర్సును రెండు సంవత్సరాలలోపు పూర్తి చేయవచ్చునని, క్రీడాకారులకు ప్రస్తుత ఉద్యోగాలకు అంతరాయం కలిగించకుండా పూర్తి చేయడానికి వీలు కల్పిస్తుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్‌లో ధరఖాస్తు చేసుకోవచ్చునని, ఇతర పూర్తి నోటిఫికేషన్ కొరకు చిత్తూరు డిఎస్ఏ కార్యాలయ పనివేళల్లో సంప్రదించవచ్చునని బాలాజీ పేర్కొన్నారు.

## బెట్టింగ్ యాప్ నిర్వాహకుడు అరెస్ట్

**పెద్దపంజాణి, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త**



ప్రజలను మోసగిస్తూ బెట్టింగ్ యాప్‌లు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పలమనేరు రూరల్ సిఐ పరశురాముడు తెలిపారు. సిఐ తెలిపిన మేరకు వివరాలిలా.. మండలంలోని రాయలపేటకు చెందిన చంద్రబాబు అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ వద్ద షేర్ మార్కెట్‌లో డబ్బులు పెడతానని రెండు లక్షలు తీసుకుని మోసం చేశాడన్నారు. అలాగే లక్ష్మీనారాయణ బ్యాంక్ అకౌంట్‌కు చంద్రబాబు ఫోన్ నెంబరు లింక్ పెట్టుకుని బెట్టింగ్ యాప్‌లకు ఆ అకౌంట్‌ను లక్ష్మీనారాయణకు తెలియకుండా వాడుకునేవాడన్నారు. ఈ ఖాతా నుంచి సుమారు కోటి రూపాయల మేర లావాదేవీలు జరిపాడని బాధితుడు ఫిర్యాదు చేశాడన్నారు. ఈమేరకు చంద్రబాబును రాయలపేట సమీపంలోని డాబా హోటల్ వద్ద అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఇదివరకే చంద్రబాబుపై పలమనేరు, పెద్దపంజాణి స్టేషన్లలో బెట్టింగ్ యాప్ నిర్వహిస్తున్నాడని కేసులు ఉన్నాయన్నారు.

## భూ కబ్జాదారులపై చర్యలు

– స్వామి వివేకానంద విగ్రహం ఎదుట జనసంఘ్ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు

**చిత్తూరుహెల్త్, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:**



భూ కబ్జాదారులపై విచారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం జాతీయ అఖిల భారతీయ జనసంఘ్ కార్యదర్శి బికె రమణారెడ్డి ఆధ్వర్యంలో బాధితులు కట్టమంచి చెరువు ఆవరణలోని స్వామి వివేకానందవిగ్రహం ఎదుట రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా బికె రమణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పలు ప్రాంతాల్లో భూకబ్జాలు అధికమవుతున్నప్పటికీ రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. భూ కబ్జాల్లో 80 శాతంకు పైబడి అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులే వుండటం దారుణమన్నారు. తవణంపల్లి మండలంలో ఓ మాజీ ప్రజాప్రతినిధి పెద్ద ఎత్తున భూకబ్జాలకు పాల్పడుతున్నప్పటికీ అక్కడి రెవెన్యూ అధికారులు ఆయనకు వత్తాసుగా నిలుస్తున్నారని ఆరోపించారు. ఆ ప్రజా ప్రతినిధి ఏ పార్టీ అధికారంలో వుంటే ఆ పార్టీలో చేరి యధేచ్ఛగా భూకబ్జాలకు పాల్పడుతుంటారన్నారు. తాతాల కాలం నుండి అనుభవిస్తున్న భూములను సైతం దౌర్జన్యంగా లాక్కొంటున్నప్పటికీ అక్కడి పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ధ్వజమెత్తారు. దిగువమాఘం గ్రామంలో ఓ మహిళా ఉద్యోగి దీర్ఘకాలంగా అక్కడే విధులు నిర్వహిస్తూ అవినీతికి పాల్పడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ ఈ విషయంపై స్పందించి భూకబ్జాలను కట్టడి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసంఘ్ నాయకులు సుధాకర్‌చౌదరి, బాబు రాజేంద్రప్రసాద్, శంకర్, భూములు కబ్జాకు గురైన రైతులు పాల్గొన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**చిత్తూరు, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరు హాజరు కావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. అలాగే నియోజకవర్గ, మండల స్థాయిల్లో సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలకు సంబంధింత అధికారులు విధిగా హాజరై ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలు స్వీకరించి వాటిని సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.

## నిరంతర విద్యతో వైద్య నైపుణ్యాలు అభివృద్ధి



**చిత్తూరు, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:** నిరంతర విద్యతో వైద్య నైపుణ్యాలు పెంపొందు తాయని ఎఐఎంఎస్‌ఆర్ డీన్ డాక్టర్ అల్ఫ్రెడ్ జె.ఆగస్టీన్, అసోసియేట్ డీన్ డాక్టర్ రమ్యా రామకృష్ణన్‌లు పేర్కొన్నారు. ఆధునిక వైద్య రంగంలో అనస్థీషియాలజీ ప్రాముఖ్యతను గుర్తు చేస్తూ చిత్తూరు అపోలో యూనివర్సిటీలోని డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి నాలెడ్జ్ సెంటర్‌లో ఆదివారం అనస్థీషియాలజీ విభాగం ఒక రోజు నిరంతర వైద్య విద్యా కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమం ఉదయం 8 గంటలకు ప్రారంభమై శాస్త్రీయ సెషన్లు సాయంత్రం 5 గంటల వరకు కొనసాగాయి. ఈ కార్యక్రమంను ఎఐఎంఎస్‌ఆర్ డీన్ డాక్టర్ అల్ఫ్రెడ్ జె.ఆగస్టీన్, అసోసియేట్ డీన్ డాక్టర్ రమ్యా రామకృష్ణన్, అనస్థీషియాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ జయంత్ ఎం.దేశ్‌ముఖ్‌లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేశ వ్యాప్తంగా పేరు గాంచిన నిపుణులు న్యూరోకార్డియాలజీ, ఎయిర్‌వే మేనేజ్‌మెంట్, లేబర్ అనల్జీషియా, బోన్ సిమెంట్ ఇమ్ప్లాంటేషన్ సిండ్రోమ్, హైపోటెన్సివ్ అనస్థీషియా, సిటిపిడి వెంటిలేటర్ వ్యూహాలు, ఎలక్ట్రోలైట్ ఇంబ్యాలెన్స్ నిర్వహణ వంటి అంశాలపై ప్రాక్టికల్, లోతైన సమాచారం అందించారు. ఈ కార్యక్రమం ద్వారా వైద్యులు, పరిశోధకులు, పిజీ, అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు పాల్గొని ఆధునిక వైద్య సాంకేతికతలు, క్లినికల్ ప్రాక్టీస్‌ల్లో జ్ఞానం పెంపొందించుకున్నారు.

## అమావాస్య ఉత్సవం:



**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వ రాలయంలో ఆది వారం అమావాస్య సందర్భంగా స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు. ప్రతి నెల అమావాస్య సందర్భంగా ఉత్సవం నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో మహాళయ అమావాస్య సందర్భంగా స్వామి అమ్మవార్లను కన్నులు మిరుమిట్లు గొల్పునట్లు ముస్తాబు చేసారు. బోయిలు మోసుకుంటూ శియయ్య గోపురం, రాజగోపురంల నుంచి వాహనాల మండపం వద్దకు చేర్చారు.అక్కడ అంబారిలో ప్రతిష్టించి గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవంతో పాటు టెంపుల్ ఇన్స్‌పెక్టర్ వెంకటస్వామి వారి సహచరులు పాల్గొన్నారు. ఉత్సవం తేరువీధిల, నెహ్రూవీధి, నగరి వీధి, బజారు వీధుల్లోంచి సాగింది.

## శివయ్య సేవలో అన్బు

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వ రాలయంలో ఆదివారం భక్తులుత ండోపతండాలుగా కదలి వచ్చారు.ఓ వైపు సామాన్యభక్తులు మరో వైపు విఐపిల తాకిడి అధికమైంది.ఈ నేపధ్యంలో తమిళ నాడుకు చెందిన ఐపిఎస్ అఫీసర్ అడిషినల్ ఐజి అన్బు కుటుంబసభ్యులతో వచ్చారు.వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద వేదపండితులతో స్వాగతం పలికారు. వారికి స్వామి అమ్మవార్ల దర్శనానంతరం మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.ఏర్పాట్లను ఎఇఓ మోహన్,ఎపిఆర్ఓ రవి, ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ వెంకటస్వామిలు పర్యవేక్షించారు.

## పలమనేరులో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర

**పలమనేరు టౌన్, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:** పలమనేరులో ఆదివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర పేరుతో మున్సిపల్ కమీషనర్ రమణారెడ్డి, డిఎస్పీ దేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద స్వయంగా గుంతలు తవ్వి మొక్కలు నాటి నీరు పోశారు. అంతకు ముందు మున్సిపల్ కార్యాలయం నుండి అంబేడ్కర్ సర్కిల్ వరకు భారీ ఎత్తున మహిళలు, పుర ప్రజలతో అవహన ర్యాలీ నిర్వహించారు. పరసరాలు శుభ్రంగా వుంచుకోవాలని, వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలని, ఇంటింటా మొక్కలు నాటాలని, పర్యావరణం పరిరక్షించాలని ప్ల కార్డులు చేతబట్టి నినాదాలు చేశారు. దీనిపై మున్సిపల్ కమీషర్ అందరిచేత ప్రమాణం చేయించారు. మున్సిపల్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, మెప్మా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి నుండి గొడుగు చింతలో దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాలు




**పూతలపట్టు, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త** పూతలపట్టు మండలం గొడుగు చింత గ్రామంలో దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాలు యుగంధర్ రెడ్డి, సురేష్ రెడ్డి, క్వారీ హరి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మురళీమోహన్ పాల్గొంటారు. గొడుగు చింత గ్రామంలో మొదటిసారిగా నవరాత్రి దుర్గ దేవి వేడుకలు జరగబోతు న్నందుకు గర్వంగా ఉంది. స్వస్తి శ్రీ విశ్వ వాసు నామ సంవత్సరం అశ్వయూజ శుద్ధ పాడ్యమి గొడుగు చింత గ్రామంలో 22 తేదీ నుండి శుద్ధ దశమి అక్టోబర్ 2వ తేదీ వరకు తొమ్మిది రోజులు పాటు దసరా నవ రాత్రులు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## పత్రికలో ఎంపీడీవోపై కథనాలు వచ్చినా చర్యలేవీ!

**పూతలపట్టు, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త**

పూతలపట్టు మండల ఎంపిడిఓపై పత్రికల్లో కథనాలు వచ్చిన చర్యలు మాత్రం లేవని ప్రజలు అంటు న్నారు. పూతలపట్టు మండలంలో ఎంపీడీ వో కార్యాలయంకు డ్యూటీకి వచ్చామా జీతం తీసుకుందామా అన్నట్లుగా మారింది. ఎంపిడివో పనితీరుపై అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్యూటీకి పోయా మా జీతం తీసుకున్నావా అనే ధోరణలో ఎంపీడీవో పనిచేస్తున్నారు. తన విధులు పట్ల పూర్తి బాధ్యత రాహి తంగా వ్యవహరిస్తున్నారు. తన విధులు పట్ల తాను నిర్లక్ష్యంగా వ్యవహారించడమే కాకుండా తన కింద స్థాయి కూడా సక్రమంగా విధుల నిర్వహించకుండా ఆంక్షలు విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీవో కింద పనిచేస్తున్న అటెండర్లు విధులకు కూడా సక్రమంగా నిర్వహించలేక పోతున్నారు. దీంతో లబ్ధిదారులకు అందాల్సిన ప్రభుత్వ పథకాలు అందడం లేదని వాపోతున్నారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

– కడ పి.డి. వికాస్ మర్మత్



**కుప్పం, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త**

నియోజకవర్గ స్థాయిలో ప్రతి సోమవారం కుప్పంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంను నేడు అనివార్య కారణాలచేత రద్దు చేసినట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. ప్రజలు గమనించాలని కోరారు.

## ఉచిత కంటి ఆపరేషన్లకు 54మంది ఎంపిక

**కుప్పం, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త** సాయిమాతా సేవా ట్రస్ట్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, బెంగళూరు శంకర కంటి ఆస్పత్రి వారిచే ఆదివారం కుప్పంలో నిర్వహించిన ఉచిత క ంటి వైద్య శిబిరానికి విశేష స్ప ందన లభించింది.సుమారు రెండువ ందల మందిఇ వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. యాభై నాలుగు మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి సోమవారం బెంగళూరులో కంటి ఆపరేషన్లు నిర్వహిస్తారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు డిఎన్ జగదీష్‌బాబు, వైద్య సిబ్బంది రాజేష్, మటార్లపల్లి వీరభద్రప్ప పాల్గొన్నారు.



## పరకామణి చోరీలు వైకాపా పాపం - మాజీ ఎమ్మెల్సీ గౌనివారి



**శాంతిపురం, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త** తిరుమలలో శ్రీవారికి భక్తులు కానుకలు చెల్లించే పరకామణి సొమ్ములను వైకాపా పాలనలో చోరీలు చేయడం పాపమని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఇఒగా ధర్మారెడ్డి, ఛైర్మన్‌గా కరుణాకర్‌రెడ్డిలు ఉన్న సమయంలో రవి కుమార్ అనే ఉద్యోగి చోరీకి పాల్పడిన వీడియోలు బయటకు వచ్చాయన్నారు. అనంతరం ఈ విషయం బయటకు పొక్కిందన్నారు. నాడు టిటిడిలో పెద్దలుగా ఉన్న వారు ఆ నిందితుడి నుంచి ఆస్తులు, భూములు రాయించుకుని కేసు లేకుండా చేశారన్నారు. ఈ ఘటనపై ప్రస్తుత బోర్డు, అధికారులు లోతైన విచారణ చేయించాలన్నారు.

## నేటినుంచి అమ్మవారి ఆలయాల్లో నవరాత్రులు

**కుప్పం, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త** కుప్పం పట్టణంలోని వివిధ ఆలయాల్లో సోమవారం నుంచి దసరా శరన్నవ రాత్రుల కార్యక్రమాలను చేపట్టనున్నారు. స్థానిక శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయంలో రోజూ అమ్మ వారికి విశేష పూజలతో పాటు సా ంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ బిఎంకె రవిచంద్రబాబు తెలిపారు. అలాగే పట్టణంలోని కొత్తపేట, పాతపేటలోని శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయాలతో పాటు మిగతా అమ్మవారి ఆలయాలు కూడా నవరాత్రుల ఉత్సవాలకు ముస్తాబ వుతున్నాయి. **రామకుప్పం:**మండలంలోని ప్రధాన ఆలయాల్లో నేటి నుంచి నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆనిగానూరు శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయం, కంబాల దేవునిపల్లిలో సప్తమాత్రిక చౌడేశ్వరమ్మ, రామకుప్పంలోని శ్రీ కన్ యకా పరమేశ్ వరి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

## ఉపాధి కూలీలు ఇ-కెవైసి చేసుకోవాలి

**పెద్దపంజాణి, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త** మండలంలో పనిచేస్తున్న ఉపాధిహామీ కూలీలు తప్పక ఇ–కెవైసి చేయించుకోవాలని ఎంపిడిఒ బాలాజీ కోరారు. ఆదివారం ఆయన మద్దలకుంట గ్రామంలో ఇకెవైసి కార్యక్రమాన్ని పరిశీలించారు. మ ండలంలో మొత్తం 11540మంది వేతనదారులకు ఇకెవైసి చేయాల్సి ఉండగా ఇప్పటికే 4350మందికి, ఆదివారం డ్రైవ్ మోడ్‌లో 1450మందికి పూర్తి చేశామన్నారు. ఈనెల 25లోగా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జెఇ సుబ్రమణ్య ం, సిబ్బంది బాబు పాల్గొన్నారు.



## చంద్రమౌళీస్వర స్వామి దేవస్థానంలో దశరా శరన్నవరాత్రి వేడుకలు

***కల్లూరు, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త*** కల్లూరులో వెలసిన శ్రీ ప్రసన్న గౌరీదేవి సమేత చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో దశరా శరన్నవరాత్రి వేడుకలు ఈ నెల 22వ తేది అనగా సోమవారం నుండి ప్రారంభిచి అక్టోబరు 1వ తేది వరకు నిర్వ హించనున్నట్లు కల్లూరు శివాలయం ప్రధానార్చకులు కె. రామ చంద్రరావ్ తెలిపారు. అందువల్ల భక్తులు ఈ దశరా ఉత్చవములలో పాల్గొని అమ్మవారి క్రుపకు పాత్రులు కావలెనని కోరారు. కాగా అమ్మ వారి రోజువారి అలంకారముల వివరాలు 22వ తేదీ సోమవారం శ్రీ బాల త్రిపుర సుందరిదేవి, 23న మంగళ వారం శ్రీ అన్నపూర్ణ దేవి, 24న బుధవారం శ్రీ గాయత్రీ దేవి 25న గురువారం శ్రీ కాశ్చయనీ దేవి, 26న శుక్రవారం, శ్రీ మహాలక్ష్మి దేవి, 27న శనివారం శ్రీ వారాహి దేవి, 28వ తేదీ, ఆదివారం శ్రీ లలితాదేవి, 29వ తేది సోమవారం, శ్రీ సరస్వతి దేవి, 30వ తేది మంగళవారం శ్రీ దుర్గాదేవి అక్టోబర్ 01వ తేది బుధవారం శ్రీమహిసాసుర మర్దిని, 02వ తేదీ గురువారం శ్రీ బహుళముఖీదేవి, 01వ తేదీ శ్రీ మహిసాసుర మర్దిని అమ్మవారి అలంకారం రోజు సాయంత్రం 6.30 గంటలకు చండీ హోమం నిర్వ హిస్తున్నామని తెలిపారు. అందువల్ల ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## డాబా వద్ద ఇరువర్గాల ఘర్షణ

***పుంగనూరు రూరల్, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త*** పట్టణం నూతన బైపాస్ సమీపంలో శ్రీ బోయకొండ గంగమ్మ డాబా వద్ద మాటా మాటా పెరిగి ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో మేలు పట్ల చెందిన అరవింద్, సింగిరి గుంటకు చెందిన కే సుబ్రహ్మణ్యం, పెంచుపల్లి కు చెందిన పాముల హరి, గాయపడ్డారు. గొడవలు గాయపడ్డ వారిని స్థానికులు ఏరియా ఆసుపత్రికి తరలించి పోలీసులకు సమాచారం తెలిపారు .ఘటనపై పూర్తి వివరాలు పోలీసుల విచారణ చేయాల్సి ఉంది .

## అనాధ శవానికి హెల్పింగ్ హ్యాండ్స్ అంత్యక్రియలు



**పలమనేరు, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:** పలమనేరు హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అనాధ శవానికి అంత్య క్రియలు పూర్తి చేసి మాన వత్వం చాటుకున్నారు. పట్టణంలోని కెవిఎస్ వీధికి చెందిన తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొం టోంది. తన భర్త హటాత్తుగా మృతిచెందడంతో అంత్య క్రియలు చేయడానికి తగిన స్థోమతలేక హెల్పింగ్ హ్యాండ్స్‌ను ఆశ్రయించింది. దీంతో స్పందించిన సంస్థ సభ్యులు రంగంలోకి దిగి అనాధ శవనానికి అన్ని కార్యక్రమాలు సాంప్రదాయ పద్దతిలో నిర్వహించి శ్మశాన వాటికలో అంత్య క్రియలు పూర్తి చేశారు. హెల్పింగ్‌హ్యాండ్స్ సభ్యులు శివ, షణ్ముగ, తేజ, యల్లంపల్లి నరేంద్ర, అభినవ్, ఫర్హాన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు. పేద ప్రజలు కష్ట కాలంలో వున్నపుడు వారికి అండగా నిలుస్తూ మానవత్వం చాటుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ వారి సేవలను పలువురు అభినందించారు.

## నేడు పోలీస్ పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్

**చిత్తూరు, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎస్పీ తుషార్ డూడి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు జిల్లా పాత పోలీసు కార్యాలయంలో పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు హాజరై పోలీసు అధికారుల దృష్టికి తమ సమస్యలను తీసుకెళితే వాటిని అక్కడికక్కడే పరిశీలించి పరిష్కరించడానికి పోలీసు అధికారులు చర్యలు తీసుకుంటారు.

## పోక్సో కేసులో ముగ్గురు అరెస్ట్ ...రిమాండ్



పుత్తూరు, సెప్టెంబరు 21 ప్రభాతవార్త : మైనర్ బాలికను ప్రేమ పేరుతో మోసగించిన ముగ్గురు వ్యక్తులను ఆదివారం పోలీసులు పోక్సో చట్టం కింద అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. గేట్‌పుత్తూరుకు చెందిన జ్యోతిప్రసాద్ (22) తన స్నేహితుడు మదన్ (22) సహాయంతో స్థానికంగా వుండే ఒక మైనర్ బాలికను ప్రేమ పేరిట 25 రోజుల క్రితం చెన్నైకు దగ్గరలోని రెడ్ హిల్స్ ప్రాంతానికి తీసుకెళ్లి మోసం చేశాడు.బాలిక తల్లి ఫిర్యాదు మేరకు జ్యోతి ప్రసాద్‌తో పాటు అతని తల్లి పి.ప్రేమలత (40), మదన్ తల్లి ఎం.మల్లిగ (38)లను పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కుపంపారు. మదన్ పరారీలో వున్నాడు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఎర్రబస్సులో " స్త్రీశక్తి "రగడ

***చౌడేపల్లి, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త***



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు పరచుతున్న " స్త్రీ శక్తి "పథకాన్ని కొందరు మహిళలే అపహాస్యం చేస్తున్నారు. ఎంపిక చేయబడ్డ ఆర్టీసీ బస్సుల్లో మహిళలు రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించేలా చర్యలు తీసుకొన్నారు. ఇందుకోసం ప్రభుత్వంచే మంజూరు చేయబడ్డ గుర్తింపు కార్డును తప్పనిసరి చేశారు. అయితే సద్వినియోగం చేసుకోవడంలో మహిళలు తప్పడడుగులు వేస్తున్నారనేందుకు బస్సులో జరిగిన సంఘటన నిదర్శనంగా నిలచింది. గుర్తింపు కార్డు లేకుండా బస్సెక్కిన ఇద్దరు మహిళలు కండక్టరుపైకి వాగ్వాదానికి దిగారు. తిరుపతి నుంచి చౌడేపల్లి మీదుగా పుంగనూరు వెళుతున్న ఆర్టీసీ బస్సులో చౌడేపల్లిలో ఇద్దరు మహిళలు పుంగనూరుకు ఎక్కారు. యదా ప్రకారం బస్సు కండక్టర్ వారి గుర్తింపు కార్డును అడిగాడు. అయితే సదరు మహిళల్లో ఒకరు సెల్‌ఫోన్‌లో ఆధార్‌కార్డు ఉందని తెలపగా అది చెల్లదనీ, చెకింగ్‌లు వస్తే తన ఉద్యోగానికి ఎసరు పెడతారని అతను వారికి తెలియజేసాడు. అయితే మహిళలు తమ ఇవే వున్నాయనీ, ఎక్కువగా మాట్లాడితే అంటూ పత్రికల్లో రాయలేని పదాలు ఉపయోగించారు. ఇదంతా గమనిస్తున్న డ్రైవర్ పొదలపల్లి వద్ద బస్సును పక్కకు ఆపాడు. దీంతో కోపోద్రేకులైన మహిళలు వారిద్దరిపైనా తిట్ల వర్షాన్ని కురిపించారు. బస్సులో వున్న ప్రయాణీకులు వారించి ఇద్దరు మహిళలను కిందకు దింపేయడంతో పరిస్థితి సద్దుమణిగింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గుర్తింపు కార్డులు తీసుకొని వస్తే ఎలాంటి సమస్య లేదనీ, స్త్రీశక్తి ఉచిత ప్రయాణంలో మహిళలందరూ కార్డులను తీసుకోవాలని అందరూ అన్నారు. సెల్‌ఫోన్‌లలో గుర్తింపు కార్డులు చెల్లవన్నారు. ఆర్టీసీ బస్సులో మహిళల వాగ్వాదం సోషియల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో అందరూ ఆసక్తిగా తిలకించారు.

## అసాంఘీక కార్యక్రమాలకు అడ్డాగా ప్రభుత్వ భవనం




**చౌడేపల్లి, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త** నిత్యం వివిధ పనుల కోసం వచ్చివెళ్ళే వారితో రద్దీగా వుండే ప్రదేశం...ఉదయం నుంచి సాయంత్రం వరకు అసాంఘీక కార్యక్రమాలకు అడ్డాగా వున్న భవనం...స్థానిక ఎంపిడిఓ కార్యాలయ సముదాయంలోని భవనం నందు పలు అసాంఘీక కార్యక్రమాలు జరుగుతున్నాయని స్థానికులంటున్నారు. ఆర్ఓఆర్‌వాటర్ ప్లాంట్ పక్కనే పాతపడ్డ సచివాలయ భవనం వుంది. భవనంలో రాత్రింబవళ్ళు వ్యభిచారం, మద్యం సేవించడం వంటి పనులు జరుగుతున్నాయనీ, మహిళలు ఆవైపు వెళ్ళాలంటేనే భయంగా వుందని వారంటున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని పాత సచివాలయ భవనంలో అసాంఘీక కార్యక్రమాలను నిరోధించాలని కోరుతున్నారు. ఎంపిడిఓ కార్యాలయ సముదాయంలో పాతబడి శిథిలావస్థలో భవనాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

## బోయకొండపై భక్తుల రద్దీ సాదారణం

**బోయకొండ(చౌడేపల్లి), సెప్టెంబర్ 21 ప్రభాతవార్త**



శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ సాధారణంగా కనిపించింది. దసరా పండుగ సందర్భంగా కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చే యాత్రీకులు గణనీయంగా తగ్గడం వల్లనే సాదారణ రద్దీ కనిపించింది. ఆలయ ఇఓ, ఉప కమీషనర్ ఏకాంబరం భక్తులకు సౌకర్యాలు కల్పించారు. ఈ నెల 23నుంచి అక్టోబర్ 2వరకు ఆలయంలో దసరా మహోత్సవాలు నిర్వహించనున్న తరుణంలో జరుగుతున్న ఏర్పాట్లను పర్యవేక్షించారు. దసరా శరవన్నవరాత్రుల్లో సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకొంటున్నట్లు ఆయన వివరించారు. ఆలయ అధికార, సిబ్బంది యాత్రీకులకు సేవలందించారు.

## వినయ శ్రద్ధలతో మహాలయ అమావాస్య తర్పణాలు

***పుంగనూరు సెప్టెంబర్ 21*** **ప్రభాతవార్త** పట్టణ గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు అత్యంత వినయ శ్రద్ధలతో మహాలయ అమావాస్య పితృతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం మహాలయ అమావాస్య రావడంతో పాటు పితృపక్షాలు పూర్తికావడంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రతి ఇంటిలో తర్పణ కార్యక్రమాలు జరిగాయి, పట్టణంలోని కోనేరు యాభై రాళ్ల మరవ ప్రాంతాల వద్ద, నీటిపారుదల ప్రాంతాలలో పిండ ప్రదాన కార్యక్రమాలను ప్రజలు శ్రద్ధగా నిర్వహించుకున్నారు. సందర్భంగా పితృదేవతల పేరిట ఇండ్ల వద్ద పలువురు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మహాలయ అమావాస్య రోజున పితృ దేవతలకు తర్పణ ప్రాధాన్యతను అర్చకులు రామనాథ శర్మ వివరించారు.



## సుబ్రమణ్యంస్వామి ఆలయ అభివృద్ధికి సహకరించండి

**వెదురుకుప్పం, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త :** మండలంలోని నల్లవెంగనపల్లె పంచాయితీ పరిధిలోని



వేపేరి కొండ పై నూతనంగా నిర్మిస్తున్న ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆలయ నిర్వాహకులు, స్థాని కులు ఆదివారం గంగాధర నెల్లూరు నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు గురసాల కిషన్ చంద్‌ను కోరారు. ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి దుశాలువతో సన్మానించి పుష్ప గుచ్చం అందజేశారు. వారు మాట్లాడుతూ ఆలయం కొండ పై ఉందని నిర్మాణ పనులు వేగవంతంగా చేస్తున్నామని చెప్పారు. కాగా ఆలయం మార్గం సరిగా లేదని ప్రభుత్వ నిధులు మంజూరుకు సిఫార్సు చేసి అభివృద్ధికి సహకరించాలన్నారు. అలాగే ఆలయ ప్రాంగణం ఒక్కసారి సందర్శించి అభివృద్ధికి సాయం చేయాలని కోరారు. ఆయనస్పందిస్తూ దైవ కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే రోడ్డు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌గారి దృష్టికి తీసుకువెళ్ళి ప్రభుత్వ నిధులు మంజూరుకు కృషి చేస్తామని చెప్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, మారేపల్లె మాజీ సర్పంచ్ రమేష్ రెడ్డి, పాతగుంట గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి షణ్ముగం రెడ్డి, స్థానికులు తిరుపాల్, భాస్కర్ నాయుడు, సాంబశివా రెడ్డి, ధనపాల్, శంకర్ రెడ్డి, కోటి, మునిరత్నం, శివ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ విద్యార్థుల పరికరాల కోసం వైద్య నిర్ధారణ శిబిరం

***గంగాధర నెల్లూరు సెప్టెంబర్ 21*** **ప్రభాతవార్త :** దివ్యాంగ విద్యార్థులకు పరికరాలు అందజేయడం కొరకు వైద్య నిర్ధారణ శిబిరం సోమవారం ఉదయం 9.30 గంటలకు మండలంలోని ప్రాథమిక పాఠశాలలో జరుగుతుందని మండల విద్యాశాఖాధికారులు ఆంజనేయులు శెట్టి, గుణశేఖర్ రెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఆలీమ్‌కో సంస్థ వైద్యుల సహకారంతో సమగ్రశిక్ష చిత్తూరు ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచితంగా పరికరాలు అందజేయడం కొరకు వైద్య నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేయడం జరుగు తుందని చెప్పారు. నియోకవర్గంలోని గంగాధర నెల్లూరు. వెదురుకుప్పం, కార్వేటినగరం, పెనుమూరు. పాలసముద్రం శ్రీరంగరాజపురం మండలాల పరిధిలోని 18 సంవత్సరాల వయస్సులోపుగల దివ్యాంగ విద్యార్థులు శిబిరంకు హాజరుకావచ్చున్నారు.

## అభ్యుదయ కవి గురజాడ అప్పారావు

**చిత్తూరురూరల్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** ఆనాటి దురాచారాలను ఖండిస్తూ నేటి సమాజానికి సైతం స్పూర్తిగా ఆధునిక సమాజానికి అడుగజాడగా అభ్యుదయ కవి గురజాడ అప్పారావు నిలిచారని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు హెచ్ అరుణశివప్రసాద్ తెలిపారు. ఆదివారం గురజాడ అప్పారావు 163వ జయంతిని జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి యుగంధర్‌బాబు, జిల్లా పర్యావరణ విభాగం కన్వీనర్ సుధాకర్‌లు మాట్లాడుతూ యువతకు మ్యాజిక్‌పై శిక్షణా తరగతులు నిర్వహించడం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో మూడనమ్మకాలను పారద్రోలడం, ప్లాస్టిక్ వస్తువులను రీసైక్లింగ్ చేయాల్సిన అవశ్యకత గురించి వివరించడం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. వీరితో పాటు జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షురాలు జయంతి,రాష్ట్ర జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు వైఎస్ నాగేశ్వర్, కోశాధికారి గిరిధర్‌మూర్తి తదితరులు ప్రసంగించగా బాల చైతన్య, రంగనాథం, త్యాగరాజునాయుడు, సాంబయ్య, రామచంద్ర, వేణుగోపాల్, విజయ్‌కుమార్, సుదర్శనా చారి, శివశంకర్ తదితరులు పాల్గొని జయప్రదం చేసారు.



## శ్రీవారిని దర్శించుకోవడానికి పాదయాత్రగా వెళ్లిన భక్తులు

**పాలసముద్రం సెప్టెంబర్ 21 ప్రభాతవార్త**



పాలసముద్రం మండలంలోని కేజే పురం పంచాయతీకి చెందిన సుమారు 150 మంది భక్తులు శ్రీవారి మాల ధరించి పసుపు బట్టలతో పాదయాత్ర గా బయలుదేరారు. గత కొన్ని రోజులకు ముందు వెంకటేశ్వర స్వామి మాల ధరించి నియమనిష్ఠలతో ఉండి ఆదివారం ఉదయం శ్రీవారి దర్శనం కోసం బయలుదేరారు. స్వామివారిని దర్శించుకోవడానికి సుమారు మూడు రోజులు కావడంతో భక్తులందరికీ అదే గ్రామానికి చెందిన నాగప్ప ,రవి రెడ్డి పాండు రెడ్డి, శీను రెడ్డి భక్తులందరికీ పసుపు బట్టలు మరియు భోజన వసతి కల్పించారు.

## అతిగా మద్యం సేవించి యువకుడు మృతి?



**రేణిగుంట సెప్టెంబర్ 21 ప్రభాతవార్త** రేణిగుంట మండలం గుత్తి వారి పల్లె సచివాలయం సమీపంలో పంట పొలాల వద్ద సుమారు 25 నుండి 35 సంవత్సరాల మధ్య వయసుగల యువకుడు ఆదివారం మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. వీఆర్ఏ ఫిర్యాదు మేరకు రేణిగుంట అర్బన్ పోలీసులు సంఘటన స్థలం చేరుకున్నారు. మృతుడు బాగా మద్యం సేవించి మృతి చెంది ఉంటాడని ప్రాథమికంగా నిర్ధారించారు. మృతుడు నీలం రంగు పూర్తి నెక్ బనీను, నీలం రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు. శరీరంపై ఎలాంటి గాయాలు లేవని పోలీసులు తెలిపారు. బాగా మద్యం సేవించి శరీరం డీహైడ్రేషన్ కారణంగా మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుని ఆచూకీ తెలిసినవారు. అర్బన్ పోలీస్ స్టేషన్ ల్యాండ్ లైన్ నంబర్ 08772289023, అర్బన్ సిఐ జయచంద్ర మొబైల్ నెంబర్ 9491074540, అర్బన్ ఎస్ఐ నాగరాజు మొబైల్ నెంబర్ 9440796765 లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

## శరీరంలోని అన్ని భాగాల్లో కన్ను ముఖ్యమైంది



**రేణిగుంట సెప్టెంబర్ 21 ప్రభాతవార్త** శరీరంలోని అన్ని భాగాల్లో కళ్ళు చాలా ముఖ్యమైన భాగమని ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ సాయి కిరణ్ అన్నారు. రేణిగుంట పట్టణం వేణుగోపాలపురం శివాలయం సమీపంలో ఆదివారం యష్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం జరిగింది. ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ సాయికిరణ్ ఆధ్వర్యంలో వైద్య నిపుణులు డాక్టర్ రాజ్ యశ్వంత్, డాక్టర్ రమ్య సమక్షంలో ఆసుపత్రి వైద్య బృందం దాదాపు 200 మందికి అత్యాధునిక కంప్యూటర్ అనుసంధానమైన డిజిటల్ పరికరాలతో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 20 మందికి క్యాట్రాక్ట్ సర్జరీ అవసరమని నిర్ధారించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి అవసరాలను బట్టి మందులు ఉచితంగా అందజేశారు. 20 మందికి శస్త్ర చికిత్సను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు యష్ ఆసుపత్రి యాజమాన్యం తెలిపారు. వైద్య శిబిరంలో ల్యాబ్ టెక్నీషియన్ వాసు, ఆసుపత్రి సిబ్బంది వైద్య సేవలు అందజేశారు.

## పిరమిడ్ మాస్టర్లందరూ అంబాసిడర్స్ గా మెలగాలి



**తిరుపతి విద్య, సెప్టెంబర్ 21 ప్రభాత వార్త:** విశ్వశాంతి కోసం పీఎంసీ నిర్వహణలో తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో జరుగుతున్న ధ్యాన మహ యజ్ఞం దిగ్విజయంగా ఐదవ రోజు పూర్తిచేసుకొని ఆరోరోజుకు చేరుకుంది. ధ్యాన మహాయజ్ఞంలో విశ్వశాంతి కోసం ప్రతి రోజు 6 గంటల పాటు సామూహిక ధ్యాన సాధన చేస్తున్నారు పిరమిడ్ మాస్టర్లు. ఇందులో భాగంగా కార్యక్రమంలో ఆరోరోజు ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు పిరమిడ్ ఆస్థాన విద్వాంసులు వయోలిన్ గణేష్ బృందం సంగీత నాద ధ్యానం నిర్వహించారు.ఈ సంగీత నాద ధ్యానంలో విశేష సంఖ్యలో ధ్యానులు పాల్గొని విశ్వశాంతిని కాంక్షిస్తూ మూడు గంటల పాటు అఖండ సామూహిక ధ్యానం చేసారు.ఈ సందర్భంగా పీఎంసీ ట్రస్ట్ చైర్మన్ దాట్లహన్మంతరాజు మాట్లాడుతూ బ్రహ్మర్షి పత్రీజీ చేతిలో తాను ఒక పనిముట్టను మాత్రమేనని స్పష్టం చేసారు.పీఎంసీ ఛానెల్ అందరిదీ అని తెలిపారు పిరమిడ్ మాస్టర్లందరూ అంబాసిడర్స్ గా అయ్యేందుకు ప్రయత్నించాలని సూచించారు. పీఎంసీ ఎంతో మందిని ధ్యానులుగా,జ్ఞానులుగా, శాకాహారులుగా మార్చిందని, పీఎంసీకి ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించాలని కోరారు. పీఎంసీ మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్ కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సేత్ బాలకృష్ణ,డైరెక్టర్లు బ్రాండ్ అంబాసిడర్స్ అచీవర్స్ కు అవార్డులను అందజేసారు.

## ఊరించి ఊరించి చివరకు మొండి చేయి చూపారు!

**అధిష్టానం నిర్ణయంపై భగ్గుమంటున్న దేశం వర్గాలు**



**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 21 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన ధర్మకర్తల మండలి చైర్మెన్ పదవిని మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యానాయుడుకే అని సుమారు ఒకటిన్నర సంవత్సరంగా ఊరించి ఊరించి చివరకు మొండి చేయి చూపారని 'నిస్వార్ధసేవకునికి తీరని అన్యాయం' జరిగిందని దేశం వర్గాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అయితే కూటమి ప్రభుత్వం కాబట్టి వివిధ సమీకరణలతో ఇక్కడి శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్‌పదవిని జనసేనకు అప్పగించారు.దాంతో ఎన్నికలు జరిగినప్పటి నుంచి శాసనసభ్యుడు దేవస్థానం చైర్మెన్ పదవి చెంచయ్యానాయుడుకే అని పలుమార్లు ప్రకటించారు.అంతేకాక అధిష్టానానికి కూడా జాబితాలను ఇచ్చారు.ఈ నేపథ్యంలో ఆదివారం చెంచయ్యానాయుడు విజయవాడ నుంచి శ్రీకాళహస్తి మండలంలోని మన్నవరం గ్రామానికి వచ్చిన సందర్భంగా మాజీ ధర్మకర్తల మండలి సభ్యుడు కాసరం రమేష్ సారధ్యంలో పలువురు కలసి చర్చించారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు నాటి శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డితో పోరాటాల్లో ఎంతో కాలం కనబడకుండా ఉన్న రోజులున్నాయి.అయితే కూటమిలో సర్దుబాటు అంటూ ఎంతో కీలకమైన శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని జనసేనకు ఇవ్వటం బాధాకరమన్నారు. ఆయనతోపాటు మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ చెలికం పాపిరెడ్డి, టౌన్‌బ్యాంకు మాజీ డైరెక్టర్ ఢిల్లిబాబు, కోరా రాజేష్, చుక్కల రమేష్, తుమ్మా బాల, మహేష్, వేముల నరేంద్ర, వివేక్‌గౌడ్, కిషోర్,మొద్దు సురేష్‌లు పాల్గొన్నారు.

## సేవా సమితి సారధ్యంలో అన్నదానం



**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 21 ప్రభాతవార్త** దక్షిణ కైలాస సేవా సమితి సారధ్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. పవిత్ర మహాలయ అమావాస్య సందర్భంగాఅన్నసమర్పణ కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు వివరించారు.పట్టణ నడిబొడ్డులోని తేరువీధిలోని యాత్రికుల బస్టాండ్‌లో నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు అన్నదానం జరిపారు. పులిహోర,సాంబార్ ప్రసాదం,పెరుగన్నం, మూడు రకాల స్వీట్లు పంపిణి చేసారు. పితృదేవతల ఆశీర్వాదం కోసం వచ్చిన భక్తులకు అన్నసంతర్పణకు వచ్చిన వారికిసేవలందించే భాగ్యం శివయ్య కల్పించాడని నిర్వాహకులు భావించారు.

## నదిలో గల్లంతైన చిన్నారుల కుటుంబాలను ఆదుకోవాలి!



**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 21 ప్రభాతవార్త**శ్రీకాళహస్తిలోని ముత్యాలమ్మగుడివీధికి చెందిన ఇద్దరు విద్యార్థులు స్వర్ణముఖి నదిలో ఈతకు సరదాగా వెళ్ళి మృత్యువు పాలయ్యారని వారి కుటుంబాలను దేవస్థానం ఆదుకోవాలని మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు శ్రీనివాసులు వారి సహచరులు డిమాండ్ చేసారు.ఆదివారం ఆయన సువర్ణముఖి నదిలో ఈతకు వెళ్ళి గల్లంతైన ఇద్దరు చిన్నారుల కుటుంబాలను పరామర్శించారు. ఇక్కడ రోడ్డు పనుల కోసం వరద నీటిని మళ్ళించుటకు మడుగులుగా మార్చారన్నారు. దాంతో సమాచారం తెలియని చిన్నారులు నదికి వరద వచ్చిందన్న సరదాతో వెళ్ళి ఆకాల మరణం పొందారన్నారు. ఇంటర్ చదివే గుణ మృతదేహం ఆదివారం గత ఈతగాళ్ళ తో బయట పడిందన్నారు.అలాగే శనివారం హారున్ అనే చిన్నారి మృతి చెందిన విషయం విదితమే అన్నారు. రెండు కుటుంబాలను ఆయన పరామర్శించారు. దేవస్థానం కాంట్రాక్టర్ ద్వారా పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేసారు. ఆయనతో పాటు రరమేష్, పఠాన్ ఫరీద్‌ఖాన్,సురేష్, కంఠ ఉదయ్‌కుమార్, బుల్లెట్ శ్యామ్ రాయల్, సాధన మునస్వామి రాయల్, జుంలేషా, అస్లాం,సాధిక్, ముని కుమార్ తదితరులున్నారు.

## ఆనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు సాయం



**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి పట్టణంలోని పిట్టలవారి సందులో నివాసముంటున్న ఓ మహిళ గుండెజబ్బులతోనూ, కిడ్నీ సమస్యలతో సతమతమౌతుండగా గుర్తించిన ఎక్ట్ యాంటీ కరప్షన్ కమిటి ఆదుకుంది.ఈ సమస్యను జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్‌రహమాన్ దృష్టికి స్థానిక కమిటి సభ్యులు తీసుకొచ్చారు. దాంతో స్థానిక కమిటి సభ్యులు లాలూ ఆ మహిళను ఆదుకొనుటకు కొంత ఆర్ధిక సహాయంతో పాటు మందులు,పండ్లు అందించారు. ఆనారోగ్యంతో బాధపడుతున్న ఆమె గురించి కుటుంబసభ్యులు పట్టించుకోలేదని కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమౌతుందనటానికి ఇదో నిదర్శనమని లాలూ అభిప్రాయపడ్డారు.నెల్లూరు జిల్లా అధ్యక్షుడు మహబూబ్‌బాషా, మీడియా అధ్య క్షులు పాపా నాయుడుపేట యాసిన్, మీర్జాసాహెబ్,అన్వర్ తదితరులు పాల్గొని ఆ మహిళకు మానసిక ధైర్యాన్నిచ్చారు.

## గుడిమల్లంలో రాష్ట్రీయ పోషణ మాసం

**శ్రీకాళహస్తిరూరల్,సెప్టెంబర్ 21 ప్రభాతవార్త** ఏర్పేడు మండలం గుడిమల్లం అంగన్‌వాడిలో ఆదివారం ఎనిమిదవ రాష్ట్రీయ పోషణ మాసంను ఐసిడియస్ సారధ్యంలో పౌష్టికాహార ప్రదర్శనను ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళలు, తల్లులు గర్భిణీలు హాజరయ్యారు.వారి నుద్దేశించి సూపర్‌వైజర్ అనిత మాట్లాడుతూ ప్రభుత్వం పోషణ మాసోత్సవంగా నిర్వహించుటకు ఆదేశించారన్నారు.ఈ నేపథ్యంలోవచ్చేనెల 16 వరకు నిర్వహిస్తామన్నారు. మహిళలు ఆరోగ్య పరిరక్షణలో భాగంగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ప్రతిగర్భిణి ప్రసూతిని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో జరుపుకోవాలని సూచించారు. అంతేకాక మనకు అందుబాటులో ఉన్న మనకు లభ్యమయ్యే ఆకు కూరలు,కూరగాయలు, చిరుధాన్యాలు, కోడిగుడ్లు, పాలును తీసుకోవాలన్నారు. రక్తహీనత గ్రామాలుగా తీర్చి దిద్దటంలో మహిళలు,కిషోరబాలికలు,గర్భిణిలు సహకరించాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ బరువు తక్కువ ఉన్న పిల్లలు అంగన్‌వాడిలు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమాల్లో బత్తలగిరినాయుడు, నరసింహాయాదవ్, పద్మనాభంనాయుడు, అంగన్ వాడిలు పాల్గొన్నారు.

## దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన దేవాలయాలు

**పుత్తూరు రూరల్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణం మండల పరిధిలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో సోమవారం నుంచి దేవి శరన్న ఉత్సవాలు అక్టోబరు 2వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పట్టణంలో రైల్వే కోటర్స్ సమీపంలో శ్రీ నాగాలమ్మదేవాలయం, శ్రీ ద్రౌపదిదేవి సమేత శ్రీ ధర్మరాజుల స్వామి దేవాలయం, ఓం శక్తి, గ్రామ దేవత, ఆరేటమ్మ, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి, మండల పరిధిలోని పరమేశ్వర మంగళం సమీపంలో ఉన్న శ్రీ వారాహి అమ్మవారి ఆలయం, శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయాలను విద్యుత్‌దీపాలంకరణ, మామిడాకు తోరణాలతో సుందరంగా అలంకరించారు. శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయంలో కలర్స్ వేసిన ముగ్గులు భక్తులను ఆకట్టుకుంటుంది.

## బురదమయంగా గ్రామీణ రోడ్లు



**విజయపురం, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** మండలంలోని గ్రామాల్లో రోడ్లు బురదమయంగా మారిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో సిమెంటు రోడ్డు ఉన్నా తేలికపాటి వర్షాలకు కూడా వర్షపునీరు రోడ్డుపైన నిలిచి రోడ్డు బురదమయంగా తయారవుతుందని వాపోతున్నారు. రోజుల తరబడి వర్షపునీరు రోడ్డుపై నిలవడం వలన దోమలు వృద్ధి రోగాలు ప్రబలుతున్నాయని, ఈ విషయమై అధికారులు స్పందించాలని కోరుతున్నారు. సిమెంటు రోడ్డు నుంచి వర్షపునీరు వెళ్ళడానికి వీలు లేకపోవడం వలన రోడ్డు బురదమయంగా తయారైందని గ్రామస్తులు వాపోతున్నారు. మండలంలోని మాధవరం, తెల్లగుంట, వరదరాజులు కండ్రిగ, కేవీ శ్రీరామపురంలో సిమెంటు రోడ్లే అధ్వానంగా తయారైందని, అధికారులు స్పందించి మరమ్మతు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## అలరించిన దుర్యోధనవధ



**రామచంద్రాపురం, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:** నూతుగుంట పల్లి వద్ద జరుగుతున్న మహాభారత ఉత్సవాలలో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టం వీక్షకులను అలరించింది. దుర్యోధనుడుగా మారేపల్లి దేవ, భీమసేనుడుగా గంటావారిపల్లి బాలాజీ, ద్రౌపథి దేవిగా అంబాల సాయిలు వేషధారణలతో దుర్యోధనుడి ప్రతి వద్దకు చేరుకున్నారు. దుర్యోధనుడు ప్రాణభయంతో గంగమడుగులో దాక్కోవడడం, తన రెచ్చగొట్టే వ్యాఖ్యలతో దుర్యోధనుడిని గంగ మడుగు నుండి వెలికి రప్పించండం, వారిద్దరి మధ్య ఘోర యుద్ధం జరగడం, ఈ యుద్ధంలో తన గధాయుధంతో దుర్యోధనుడి తొడపై భీముడు ఒక్కవేడు వేయడంతో మృతి చెందాడు.

**-భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం** మహాభారత ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. కంకణధారులైన భక్తులు 7 బావులలో స్నానమాచరించి ఉపవాస దీక్షతో అగ్నిగుంధం వద్దకు చేరుకున్నారు. ద్రౌపథి అమ్మవారిని పూజారి లక్ష్మణ రెడ్డి అగ్నిగుంధం వద్దకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అగ్నిగుంధంలో పూలబంతిని విసిరి, అగ్ని ఇప్పులతో అమ్మవారికి వడిమాల కట్టారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని మోసుకుంటూ గోవింద నామస్మరణల నడుమ అగ్నిగుండ ప్రవేశం చేశారు.

## జిల్లా స్థాయి ఎస్‌జిఎఫ్ఐ పోటీలకు ఎంపిక



***తిరుపతి విద్య, సెప్టెంబర్ 21 ప్రభాత వార్త:*** మండల స్థాయి పోటీల్లో అండర్ 14,17 కబడ్డీ, కోకో విభాగాల్లో స్థానిక ఎం ఆర్ పల్లి అమరావతి నగర్ లోని నారాయణ ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థులు సంజన, రాఘవి,ప్రణయ్,సీత, దీప్తి,కుందన,తనుశ్రీ, భువన్ సాయి జిల్లాస్థాయి ఎస్ జి ఎఫ్ పోటీలకు ఎంపిక అయ్యారు .ప్రిన్సిపాల్ మధు చంద్రుడు మాట్లాడుతూ చదువు ఒక్కటే విద్యార్థికి పరమావధి కాదని, విద్యతో పాటు శారీరక, మానసిక దృఢత్వం ఉన్నప్పుడే ప్రతి విద్యార్థి అనుకున్న లక్ష్యం సాధించగలరన్నారు.దీని కోసం క్రీడా నైపుణ్యాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తిరుపతి నారాయణ విద్యా సంస్థల యాజమాన్యం డిజిఎం కొండలరావు,ఏజీఎం శ్రీనివాసులు,ఆర్ ఐ వసంత్ కుమార్,వైస్ ప్రిన్సిపాల్ స్వాతి,అకడమిక్ డీన్ మురళి,ఏవో ఈశ్వరి, పీఈటి కిషోర్ కుమార్, ఉపాధ్యాయుల బృందం అభినందనలు తెలిపారు.

## నెలసరి పరిశుభ్రత ఆరోగ్యానికి కీలకం




***తిరుపతి విద్య, సెప్టెంబర్ 21 ప్రభాత వార్త:*** స్వస్త్ నారీ,సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతి బైరాగిపట్టెడ లోని బిసి కాలేజ్ గర్ల్స్ హాస్టల్ విద్యార్థినులకు నెలసరి పరిశుభ్రత పై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకులు,మహిళా అధ్యయన కేంద్ర ప్రాజెక్ట్ అసోసియేట్ డా.ఇ.కోన ప్రభ మాట్లాడుతూ నెలసరి సమయంలో పరిశుభ్రతను పాటించడం మహిళలు, బాలికల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత అవసరమని,సరైన పరిశుభ్రత లేకపోతే చర్మ అలర్జీలు,ఫంగల్ ఇన్ఫెక్షన్లు,పునరుత్పత్తి వ్యవస్థకు సంబంధించిన అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం వున్నదని పేర్కొన్నారు. అనంతరం నెలసరి సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత,శానిటరీ ప్యాడ్ల సురక్షిత వాడకం, నిర్వహణ,వ్యర్థాల సరైన పారవేత,ఆరోగ్య సమస్యల నివారణ కి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. జంక్ ఫుడ్స్ కి దూరంగా వుండాలని,ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని వారికి సూచించారు.ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ కె.రాధారాణి, మహిళా అధ్యయన కేంద్ర ప్రాజెక్ట్ అసిస్టెంట్ వి.ప్రీతి,మొత్తం 80 మంది హాస్టల్ విద్యార్థినులు పాల్గొన్నారు.

## స్కూల్స్, కళాశాల వద్ద ప్రత్యేక బృందాలతో పోలీసులు తనిఖీ

**-విద్యార్థులు గంజాయి మత్తులో జీవితాలను చిత్తు చేసుకోవద్దు**

***తిరుపతిరూరల్, సెప్టెంబర్21 ప్రభాతవార్త:*** విద్యార్థులు గంజాయి, చట్టవిరుద్ద పదార్థాలను సేవించి, జీవితాలను చిత్తు చేసుకోవద్దని తిరుపతిరూరల్ పోలీసుస్టేషన్ సి.ఐ.చిన్నగోవిందు సూచించారు. ఆదివారం తిరుపతిరూరల్లో స్కూల్స్, కళాశాల వద్ద డ్రగ్స్, మత్తు పదార్థాలు కోసం ప్రత్యేక పోలీసు బృందాలతో తనిఖీ చేశారు. గంజాయి, మత్తు పదార్థాలు, చట్టవిరుద్ద వస్తువుల అమ్మకాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మత్తుపదార్థాల నిర్మూలనకు నిరంతరంగా కొనసాగుతాయని సి.ఐ. తెలిపారు.

## శ్రీ కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

**-వేద పండితులచే శ్రీవారి వాహనాలను శుద్ధి**



***తిరుపతిరూరల్,సెప్టెంబర్21 ప్రభాతవార్త:*** తుమ్మలగుంట శ్రీకల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం చేస్తున్నారు. అలంకార మండపంలో శ్రీవారి వాహనాలను సుగంధ ద్రవ్యాలతో వేద పండి తులచే శుద్ధి చేయించారు. ప్రతి ఏటా తిరుమల తరహాలో శ్రీకల్యాణవెంకటేశ్వరస్వామిబ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్న విషయం తెల్సిందే. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు

## మెగా కార్పోరెట్ క్రికెట్ ఫైనల్ విజేత సంస్కృత వర్సిటీ



**తిరుపతి విద్య సెప్టెంబర్ 21 ప్రభాత వార్త:** స్థానిక తారకరామ స్టేడియంలో జరుగుతున్న మెగా కార్పోరెట్ క్రికెట్ పోటీలలో నేషనల్ సంస్కృత విశ్వ విద్యాలయం, అమరాజా జట్టు తలపడగా అమరాజ జట్టు నిర్ణీత 20 ఓవర్లకు 129 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. సంస్కృత విశ్వవిద్యాలయ బౌలర్లు డాక్టర్ యన్.వి.శ్రీనివాసరావు 3 వికెట్లు, హాన్స్ ప్రభాకర్ , ఉదయ్ శంకర్,చక్రీ తలో రెండు వికెట్లు పడగొట్టి రాణించారు.తదుపరి సంస్కృత విశ్వవిద్యాలయం జట్టు 15 ఓవర్లలో 130 పరుగులు చేసి విజయంసాధించారు. బౌలింగ్,బ్యాటింగ్ లో రాణించిన ఉదయ్ శంకర్ సంస్కృత విశ్వవిద్యాలయ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ సాధించారు.విజయం సాధించిన సంస్కృత విశ్వవిద్యాలయ టీమ్ ను వైస్ చాన్స్ లర్ ప్రొఫెసర్ జి.యస్.ఆర్ కృష్ణమూర్తి,స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ యస్.దక్షిణామూర్తి, విశ్వవిద్యాలయ యాజమాన్యం వారు అభినందించారు.

## రౌడీయిజాన్ని ఉపేక్షించేది లేదు - సీఐ

**సత్యవేడు, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** సత్యవేడులో ఎటువంటి రౌడీయిజానికి తావు లేదని స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మురళీనాయుడు స్పష్టం చేశారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవమరిస్తామన్నారు. మరో పది రోజుల్లో ఆకతాయిల వ్యవహారాలను కుకటివేళ్ళతో పెకలించి సమూలంగా నిర్మూలించడానికి సర్కిల్ పరిధిలో రెండు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి పట్ల ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు.

## పుత్తూరులో బీజేపీ ర్యాలీ

**పుత్తూరు రూరల్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:**

భారతీయ జనతా పార్టీ పుత్తూరు మండలంలో సేవా పక్షోత్సవాల్లో భాగంగా ప్రధాని మోదీ జన్మదినం నుంచి అక్టోబరు 2 గాంధీ జయంతి వరకు సేవా కార్యక్రమంలో భాగంగా పుత్తూరు ఆర్‌డీఎం గేటు నుంచి ర్యాలీగా నిర్వహిస్తూ ప్రభుత్వ ఆరోగ్యశాఖ కార్యాలయం వరకు బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోకరాజు ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం.నిషిధరాజు పాల్గొని మాట్లాడుతూ సేవా పక్షోత్సవాలు కార్యక్రమం ద్వారఆ భారతప్రధాని మోదీ జన్మదినం సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 తేదీ వరకు జరిగే సేవా పక్షోత్సవాల్లో భాగంగా స్వచ్ఛభారత్ సేవా కార్యక్రమం ప్రతి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆమె కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాజీ మండల అధ్యక్షులు శ్రీధర్, ఉపాధ్యక్షులు మధు,మోహన్ గోపి, మునస్వామి, మహిళా మోర్చా నాయకులు అరుణ, భువనేశ్వరి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి ఘన సన్మానం..

**తిరుపతి రవాణా, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త**



బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నూతనంగా నియమితులైన నాగోతు రమేష్ నాయుడు మొదటిసారి తిరుపతిలోని బీజేపీ పార్టీ ఆఫీసుకు విచ్చేశారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు గుండాల గోపీనాథ్ ఆయనను గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన ఆధ్వర్యంలో తిరుపతి జిల్లాలో భారతీయ జనతా పార్టీ పటిష్టతకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, బిజెపి జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రప్ప,బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు అనూష, రామకృష్ణ, బిజెపి సీనియర్ నాయకులు ముని సుబ్రహ్మణ్యం, పొనగంటి భాస్కర్ ప్రశాంతి రాజు, తొండమునాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, తిరుపతి గంగమ్మ గుడి పాలక మండల సభ్యులు తమ్మిశెట్టి చంద్రశేఖర్ రాయల్, చంద్రబాబు నాయుడు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శులు బీడీ బాలాజీ,నరేష్,బిజెపి జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ రెడ్డి బాబు పాల్గొన్నారు.

## చిన్ననాటి స్నేహితుల అపూర్వ కలయిక..

**తిరుపతి రవాణా, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త**



1983=84 విద్యార్థినీ విద్యార్థుల అపూర్వ ఆత్మీయ కలయిక ఆదివారం టిపి పిఎం స్కూల్ ప్రాంగణంలో జరిగింది. 40 ఏళ్ల క్రితం స్కూల్ ప్రాంగణంలోని చిన్ననాటి మరపురాని మర్చిపోలేని తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్య బోధనలు నేర్పిన గురువులను తలచుకుని వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల అకాల మరణం చెందిన గురువులను, చిన్ననాటి స్నేహితులను వారితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు పాటు మౌనం పాటించారు. స్కూల్ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని, భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని పూర్వ విద్యార్థిని విద్యార్థులు తెలిపారు.

## శ్రీవారి భక్తుల మనోభావాలే ముఖ్యం....



**రేణిగుంట సెప్టెంబర్21ప్రభాతవార్త**

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు వివిధ రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని, వారి మనోభావాలు దెబ్బతినకుండా ప్రవర్తించాలని రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల దృష్ట్యా తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు రేణిగుంట రైల్వే స్టేషన్ విఐపి లాన్ నందు స్థానిక పోలీసులు, రైల్వే పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, రైల్వే వివిధ శాఖల అధికారులు, ఆటో టాక్సీ సుమో తదితర వాహనాల డ్రైవర్లతో ఆదివారం రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు నిర్విఘ్నంగా జరగడానికి అందరూ సహకరించాలన్నారు. భక్తుల రద్దీ ఎక్కువై తొక్కిసలాటకు ఆస్కారం ఏర్పడినప్పుడు అటు ఆర్పిఎఫ్, ఇటు జిఆర్పి, మరోవైపు సివిల్ పోలీసులు సమన్వయంతో వ్యవహరించి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో రైల్వే స్టేషన్ మేనేజర్ సి.ఎస్.రెడ్డి, రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర, రూరల్ సీఐ మంజునాథ రెడ్డి,రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ వెంకటేశ్వర్లు, జిఆర్పిఎస్సై మధుసూదన్ రావు, రైల్వే టికెట్ ఇన్స్పెక్టర్ కార్తీక్, ఆర్టిసి కంట్రోలర్ గోవర్ధన్ నాయుడు, వివిధ ఆటో, సుమో, టాక్సీ యూనియన్ నేతలు డ్రైవర్లు పాల్గొన్నారు.

## మొక్కలు విరివిగా నాటుదాం... భావితరాలను కాపాడుదాం.



***రేణిగుంట, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త*** దేశ ప్రజలంతా విరివిగా మొక్కలను నాటి భావితరాలను కాపాడాలని బిజెపి శ్రేణులు పిలుపునిచ్చాయి. ప్రధాని మోడీ జన్మదిన సేవ పక్షోత్సవాల్లో భాగంగా రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు బిజెపి నాయకులు ఆదివారం తల్లి పేరుతో ఒక మొక్క నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. బిజెపి రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ కుమార్, జిల్లా బిజెపి మాజీ అధ్యక్షులు శీనప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి పిడి బాలాజీ, ఉపాధ్యక్షులు మేళాగారం సుబ్రహ్మణ్యం రెడ్డి, రాష్ట్ర వన్నెకుల క్షత్రియ డైరెక్టర్ తేజోవతి, బిజెపి అధికార ప్రతినిధి కొండేటి గోపాల్, బిజెపి మండల అధ్యక్షుడు పూజారి ప్రేమ్ కుమార్ రెడ్డి, బిజెపి యువ నాయకులు జిల్లా ముదిరాజుల సంఘం కన్వీనర్ వేణుగోపాల్ ముదిరాజ్,రేణిగుంట మండల బిజెపి ఉపాధ్యక్షుడు రాజా రాయల్, రేణిగుంట పట్టణ బిజెపి అధ్యక్షుడు నరేష్ రాయల్, బిజెపి నేతలు హరీష్ రెడ్డి, రమణారెడ్డి, అయ్యప్ప, ఆనంద్, మునిరాజా, హరి,, భాస్కర్, ఇమ్మానియేల్, ఆరోగ్య కేంద్రం సిబ్బంది మొక్కలు నాటారు.కోలా ఆనంద్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశం గర్వించదగ్గ నాయకుడిగా అభివర్ణించారు.

## తీసుకున్న డబ్బులివ్వమనే అడిగితే

**తిరిగి బాధితులపైనే కేసులా! -మీడియాను ఆశ్రయించిన బాధిత మహిళలు**




**తిరుపతి హెల్త్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త :** దాదాపు రూ. 3కోట్లతో ఇద్దరు వ్యక్తులు 18 మందిని మోసం చేసి, ఇచ్చిన డబ్బులు ఇవ్వమని అడిగినందుకు తిరిగి బాధితులపైనే కేసులు నమోదు చేశారని బాధితులు వాపోయారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో బాధిత మహిళలు గీత, జలీనా, నాగలక్ష్మి, జ్యోతి మాట్లాడుతూ తిరుపతి రూరల్ మండలం సాయినగర్‌కు చెందిన ఉమామహేశ్వరి,ఆమెకు భర్తకాని భర్త చంద్రబాబు ఇద్దరు కలిసి దాదాపు 18 మంది మహిళలల దగ్గర రూ. 3 కోట్లు డబ్బులు వసూళ్లు చేసి ఫ్లాట్స్ ఇస్తామని చెప్పి మోసం చేయడం జరిగిందన్నారు. డబ్బులు, ఫ్లాట్లు అయినా ఇవ్వండని అడిగినందుకు వారిద్దరి నుంచి సరైన సమాధానం రాక పోగా, వారిపై ఎమ్మార్‌పల్లి, అలిపిరి పోలీస్‌స్టేషన్లల్లో కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. అయితే వారే తమపై బాధితులు దాడులకు దిగుతున్నారని కేసులు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. దీనిపై ఎస్పీ వెంటనే స్పందించి వారిద్దరిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి తగు విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధితులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ముందస్తు జాగ్రత్తలతో "మతిమరుపు" దూరం

**నిద్రలేమి, మానసిక వత్తిడి, ఒబిసిటితోనే 'మతిమరుపు" : వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.వెంగమ్మ**



చంద్రగిరి, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త: ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా "మతిమరుపు" దరిచేరదని శ్రీ దేవరాజ్ యువర్స్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.వెంగమ్మ అన్నారు. మండల పరిధిలోని నరశింగాపురంలోని రెడ్డివారి నాదమునిరెడ్డి మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం శ్రీ దేవరాజ్ యువర్స్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, డెమెన్షియా ఇండియా అలైన్సెస్ సంయుక్తంగా వయో వృద్ధులకు చిత్త వైకల్య (డెమెన్షియా స్క్రీనింగ్ క్యాంప్) ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తాను మూడు దశాబ్దాలుగా తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో సేవలందించినట్లు తెలిపారు. మండలంలో మూర్ఛరోగుల కొరకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం వైస్ ఛాన్సలర్‌గా వున్న తాను చిత్తవైకల్య బాధితులకు సేవలు అందించడానికి రెడ్డివారి రాజశేఖర్ రెడ్డి, రెడ్డివారి భార్గవి రెడ్డి, రెడ్డివారి ప్రీతమ్ రెడ్డిలను సంప్రదించినట్లు తెలిపారు. ఇకపై ప్రతి నెలా ఇటువంటి కార్యక్రమాలు ఎంపిక చేసిన గ్రామాలలో నిర్వహిస్తామన్నారు. మతిమరుపుకు సంబంధించి 25-45 వయస్సులో శారీరక శ్రమ లేనిపక్షంలో (సోమరితనం) ఈ జబ్బుబారినపడతారన్నారు. అదేవిధంగా సగటున రోజుకు 8 గంటలు తప్పనిసరిగా నిద్రపోవాలన్నారు. డిజిటల్ ప్రపంచంలో మొబైల్స్ కారణంగా నిద్రలేమితో మెదడులో మలినాలు పెరుగుతాయన్నారు. కేవలం నిద్రతోనే ఈ మలినాలు శుభ్రమవుతాయని అన్నారు. ఏ జబ్బులనైనా ఆపలేము కానీ నియంత్రణలో పెట్టడం సాధ్యమే ఆమె అన్నారు. తనతో పాటు వచ్చిన వైద్య బృందాన్ని ఆమె అభినందించారు. అనంతరం మాజీ ఎంఎల్ఏ రెడ్డివారి రాజశేఖర్ రెడ్డి ఆమెను దుశ్శాలువతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్ రెడ్డి, డాక్టర్ వర్ష, డాక్టర్ అవినాష్, డాక్టర్ ఆకాంక్ష, డాక్టర్ కె.రోషిణి రెడ్డి, డాక్టర్ రసూల్ రెడ్డి, డాక్టర్ ప్రనేష్, డాక్టర్ హర్షిణి, వైద్య సిబ్బంది బొబ్బి, సాత్విక్, సుమిత్, మాజీ ఎంపిటిసి రాజేంద్రప్రసాద్ రెడ్డి (పెదబాబు), కొత్తపాటి ఈశ్వర్ రెడ్డి, కొత్తపాటి మాదవరెడ్డి, వీరంగారి రమేష్ రెడ్డి, వెంకటమునిరెడ్డి, హెచ్ఎం హైమావతి, మాజీ సర్పంచ్ బాలసుబ్రమణ్యం, సుదర్శన్ శెట్టి, టి.సింగిల్‌విండో బ్యాంక్ డైరెక్టర్ రెడ్డెప్ప, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి స్థలపురాణం పుస్తకాన్ని ఆవిష్కరించిన యాచేంద్ర

వెంకటగిరి, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి స్థల పురాణం గ్రంధాన్ని మాజీ ఎస్ విబిసి చైర్మన్ డాక్టర్ విబి సాయి కృష్ణ యాచేంద్ర ఆవిష్కరించారు. 1893 సంవత్సరం వెంకటగిరి సంస్థానాధీశులైన వెలుగోటి రాజా ముద్దుకృష్ణ యాచేంద్ర భూపాల ప్రకటింపగా బ్రహ్మశ్రీ శ్రీ చెట్లూరు వెంకటసుబ్రమణ్యం శాస్త్రి రచించిన సంస్కృత గ్రంథం శ్రీకాళహస్తి స్థల పురాణంను 132 సంవత్సరముల తరువాత తెలుగులో సంపూర్ణముగా వెలుగులోకి తీసుకురావడం జరిగింది. శ్రీకాళహస్తి స్థలపురాణం శ్రీశివపురాణాన్తర్గత శివరహస్య సంగ్రహమును తొంబై 90 అధ్యాయలను ఐదు సంపుటాలుగా, 9,430 శ్లోకాలను 1700 పేజీలుగా వేదవ్యాస మహర్షి రచించిన శ్రీకాళహస్తీ



స్థలపురాణాన్ని డాక్టర్ పాలకోడేటి జగన్నాథరావు తెలుగు భాషలో ముద్రించారు. ఇలాంటి గ్రంథం తెలుగులో మొట్ట మొదటిది ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర మహత్యం కంటే ఇది భిన్నమైనది. బృహత్తరమైన గ్రంథం సంపాదకులు దుర్గామల్లేశ్వర స్వామి ఆలయం విశ్రాంత ఈవో కెవిస్ రామారావు సంపాదకత్వంలో వెలువరించిన గ్రంథం రెండు సంపుటాలను, ఈ పుస్తకం కోసం శ్రమించిన ఒకరిలో శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన గురజాల నాగారాజ జెట్టి, వారి సోదరులు గురిజాల సుబ్రమణ్యం జెట్టి, దళవాయి నరసింహులుజెట్టి, వెంకటగిరికి చెందిన సుంకర రవికుమార్ ఉన్నారు. వెంకటగిరి సంస్థానాధీసులు సంగీత గేయధార స్పష్ట కవివర్యులు ఆయిన సాయి కృష్ణ యాచేంద్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు.

## వెంకన్నపాలెంలో దసరా ఉత్సవాలు ప్రారంభం

కోట, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త: మండలంలోని వెంకన్నపాలెం గ్రామంలో సర్పంచ్ మధుయాదవ్ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమ య్యాయి. ఆలయాలను శోభాయమానంగా తీర్చిదిద్దారు. అమ్మవారి ఆలయంలో సోమవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు శరన్నవ రాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు సర్పంచ్ మధుయాదవ్ తెలిపారు. అమ్మవారు రోజుకు ఒక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని పేర్కొన్నారు.

## శరన్నవరాత్రులను విజయవంతం చేయండి



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని శ్రీ నాగేశ్వరస్వామి దేవస్థానంలో జరిగే శరన్నవరాత్రులను విజయవంతం చేయాలని దేవస్థానం చైర్మన్ తాటిపర్తి ఆదినారాయణరెడ్డి కోరారు. ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ప్రతి నిత్యం దేవస్థానంలోని అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేయడం జరుగుతుందని చెప్పారు. 2వ తేదీన స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద సాయంత్రం శమిపూజను నిర్వహిస్తామని చెప్పారు. అదేరోజున పార్వతీ పరమేశ్వరుల గ్రామోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. భక్తులు శరన్నవరాత్రుల ఉత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని కోరారు. ఈ సమావేశంలో ట్రస్టు బోర్డు సభ్యులు పోలూరు లీలా మోహన్, పల్లమాల సుమతి, ఏవీ నాగపరిమళ, ఆనం నాయుడు, దేవస్థాన అర్చకులు పెల్లేటి సునీల్‌కుమార్ శర్మలు పాల్గొన్నారు.

## చైర్మన్‌ను కలిసిన జనసేన నాయకులు



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్‌గా నియమితులైన కొట్టె సాయిప్రసాద్‌ను ఆదివారం శ్రీకాళహస్తిలో సూళ్లూరుపేట జనసేన పార్టీ నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆకుల రమణ, షేక్ మాబాషా, ఆవుల దాస్, రేవంత్, సూరి, శంకు సురేష్, పద్మజ, సుజాతలు పాల్గొన్నారు.

## బిజెపి రక్తదాన శిబిరం విజయవంతం



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త: ప్రధాని నరేంద్రమోడీ జన్మదిన సేవా పక్షోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక బిజెపి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఆర్అండ్‌బి బంగళా వద్ద ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సూళ్లూరుపేట బిజెపి అర్బన్ ఇన్‌ఛార్జ్ ఆరణి విజయభాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఎద్దుల నరేంద్రరెడ్డిల చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు చెన్నకేశవులు, తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, తన్నీరు శేషగిరిరావు, బి.విజయమ్మ, ఆర్.కృష్ణమూర్తి, సూరిబాబు, కరుణాకర్‌రెడ్డి, కోటయ్య గౌడ్, సావిత్రి, మంజుల, వాసు, సుబ్బారెడ్డి, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిలో అక్రమాలకు చెక్ !

కోట,సెప్టెంబరు 21 ప్రభాతవార్త: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పదకం అమలుల్లో అక్రమాలకు కేంద్ర ప్రభుత్వం చెక్ పెట్టేలా కొత్త విధానం తీసుకొస్తోంది. ఇప్పటికే కూలీల నమోదుకు ప్రత్యేక యాప్ తీసుకొచ్చింది. ఒకరి స్థానంలో మరొకరు పనులు చేయడం, మస్టర్లల సంతకాలు తీసుకొని కూలీ డబ్బులు కాజేసే పనులు కొనసాగుతూ వచ్చాయి. ఇలాంటి అక్రమాలకు కట్టడికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఉపాధి కూలీలకు ఈకేవైసీ తప్పనిసరి చేసేలా చర్యలు తీసుకొంది. తొలి విడతగా రాష్ట్రంలోని ఉమ్మడి చిత్తూరు, జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు చేయనుంది. కూలీల ఆధార్‌కు అనుసంధానం చేయడం ద్వారా ఒకరికి బదులు మరొకరు పనులకు వెళ్లడం పనులకు వెళ్లలకున్నా మస్టర్లలో ఫోర్జరీ సంతకాలు చేసి నిధులు డ్రా చేసే అవకాశాలుకు ఈకేవైసీ కట్టడి చేయనుందిని అధికార వర్గాలు బావిస్తున్నారు.

## ఎస్సీ వర్గీకరణపై కోటలో బహిరంగ సభ

కోట, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో కోటలో త్వరలోనే భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు బిఎస్‌పి నాయకులు మీజూరు మాధవ్, దాసరి సుందరం, శ్రీనివాసులు చెప్పారు. ఆదివారం స్థానిక షాదీమంజిల్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పలువురు దళిత ఉద్యోగులు, జేఏసీ నాయకులు హాజరయ్యారు.

## స్థలం విషయమై ఘర్షణ

కోట, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త: కోట మండలం చిట్టేడులో ఆదివారం ఓ స్థలం విషయమై ఘర్షణ జరిగింది. ఆ మేరకు బాధితులు కోట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్థలం విషయమై చలపతి, నీలగిరి తదితరులు అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, మహేంద్రలను కొట్టి గాయపరిచారు. ఆ మేరకు పోలీసులు విచారణ చేస్తున్నారు.

## జేవివిచే దివ్యాంగులకు కూరగాయలు పంపిణీ



గూడూరు, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త: పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనము నందు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గుర్రం విజయ్ బాబు దాతృత్వంలో దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జే.వి.వి. అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ సేవా కార్యక్రమాలు కూడా చేస్తుందని ఈ నాటి కార్యక్రమానికి దాతగా వ్యవహరించిన గుర్రం విజయ్ బాబు వారి కుమార్తె ఇక్షిత కుటుంబ సభ్యులను అభినందించారు. జేవివి గత 32 సంవత్సరాలుగా ప్లాస్టిక్ నివారించాలని పోరాటం చేస్తుందని తెలిపారు. శాసనసభ జీరో అవర్ నందు స్పీకర్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా ప్లాస్టిక్ నిషేధించాలని మాట్లాడటం జరిగిందనీ అదేవిధంగా గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా అక్టోబర్ 2వ తేదీలోగా ప్లాస్టిక్‌ను పూర్తిగా నివారిస్తామని చెప్పినందుకు జేవివి తరఫున రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చెంచు నారాయణ, రామమోహన్, సుబ్బారావు, ఆనంద్, నక్కాగోపి, జగదీష్, పవన్, ఇబ్రహీం, ఇక్షిత, గుర్రం రాంబాబు, శ్రీనివాసాచారి, జానా సుధీర్, అశోక్, శర్మ, పవన్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణముఖిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



పెళ్లకూరు, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త: మండలంలోని చిల్లకూరు వడ్డీపాలెం గ్రామానికి చెందిన చమెర్తి పాపయ్య (60) ఆదివారం నాడు స్వర్ణముఖి నదిలో శవమై కనిపించాడు. వడ్డీ పాలెం గ్రామానికి చెందిన చెమెర్తి పాపయ్య శనివారం పొలం పనులకు అని ఇంటి నుంచి బయలుదేరిపోయాడు. రాత్రి అయినా సరే ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చి వెతకగా స్వర్ణముఖి నది వద్ద పాపయ్యకు సంబంధించిన ఆనవాళ్లు కనబడ్డాయి. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించిన పోలీసులు స్వర్ణముఖి నదిలో వెతుకులాట ప్రారంభించగా ఆదివారం మధ్యాహ్నం మృతదేహాన్ని గుర్తించి బయటికి తీశారు. ఎస్ఐ నాగరాజు మృతదేహం లభించే అంతవరకు సంఘటనా స్థలంలోనే ఉండి పర్యవేక్షించారు.

## మహిళ అదృశ్యంపై కేసు నమోదు

పెళ్లకూరు సెప్టెంబర్ 21 ప్రభాతవార్త : మండలంలోని చెంబేడి పాలెం గిరిజన కాలనీకి చెందిన బండీ మాధవి(22) అనే యువతి కనిపించడం లేదని ఆదివారం నాడు పెళ్లకూరు పోలీస్ స్టేషన్ లో యువతి కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. ఎస్ఐకె నాగరాజు కేసు నమోదు చేసి యువతి ఆచూకీ కోసం వెతుకులాట ప్రారంభించారు.

## గురుజాడ అప్పారావు జయంతి వేడుకలు



వెంకటగిరి, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త : స్థానిక తూర్పు వీధిలోని మహాత్మా గాంధీ గ్రంధాలయంలో గురజాడ అప్పారావు 163వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గుడివాడ అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గురజాడ అభ్యుదయ పితామహుడు, కవి సేకరణగా బిరుదులు పొందారని ఈ సందర్భంగా భక్తులు అన్నారు. 1862 సెప్టెంబర్ 21న అనకాపల్లి జిల్లా రాయవరంలో జన్మించినట్లు తెలిపారు. కన్యాశుల్కం, ముత్యాల సరాలు వంటి అనేక రచనలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయక అధికారిని తాటిశెట్టి లీలావతి, పాఠకులు పాల్గొన్నారు.

## వాకాడులో జెండా పండగ వేడుకలు

వాకాడు, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త: ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఆదివారం ఆంజనేయ స్వామి విగ్రహ చిత్రపటం వద్ద జండా పండగను ఘనంగా నిర్వహించారు. వాకాడు యూత్ ఆధ్వర్యంలో జరిగే దసరా ఉత్సవాలులో భాగంగా మొదటి రోజు అంగరంగ వైభవంగా జెండాను ఆవిష్కరించి వేడుకను నిర్వహించారు. వాకాడు గ్రామ ప్రజలు ఆంజనేయస్వామి విగ్రహ వద్ద ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆ పరిసర ప్రాంతంలో బాణా సంచాలతో, తప్పెట్లు తాళాలతో మారుమోదించారు, యూత్ డాన్సులుతో సందడి చేశారు. అనంతరం ఆంజనేయ స్వామి చిత్రపటంతో గ్రామంలోని వీధులలో తప్పెట్లు తాళాలతో తిరుగుతూ సందడి చేశారు.

# నదిలో శివం రోడ్డు నిర్మాణ హెచ్చరిక బోర్డులు ఎక్కడ!

**-గుంతల్లో పడి ఇద్దరు బాలురు మృతి**
**- ఒక ఎనుము మృతి**





శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 21 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలో కాంట్రాక్టర్లు పనులు చేస్తున్నపుడు భద్రత ప్రశ్నార్థకంగా మారింది. శ్రీకాళహస్తి దేవస్థానం శివం టు శివం రోడ్డును రూ.27కోట్లతో చేపట్టింది. పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దటానికి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించుటకు తీసుకున్న నిర్ణయం అభినందనీయమే. అయితే నదిలో వరద వస్తుందనే భావంతో నీటిని మళ్ళించుటకు గుంతలు తవ్వారు. పిల్లర్లు వేయటానికి తవ్వారు. అయితే ఇది జనసంచారం కల్గిన ప్రాంతం కాబట్టి ఇక్కడ కనీసం 'హెచ్చరిక,సూచిక బోర్డులు' ఏర్పాటు చేయాల్సి ఉంది కానీ ఎందుకో ఆలా చేయలేదు. ప్రాజెక్టు వద్ద మడుగులు ఏర్పడ్డాయి. ఇక్కడ చిన్నారులే కాకుండా పశువులు కూడా దిగి చనిపోతున్నాయి. స్వర్ణముఖి నదిలోని ప్రాజెక్టు వద్ద రెండు రోజుల్లో ఇద్దరు చిన్నారులు బలి అయ్యారు. ఒక ఎనుము మృతి చెందింది. ఇక్కడ ఏం జరుగుతుంది? ఎందుకు ఇక్కడ ఇలా జరుగుతుందనేది పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. శనివారం పట్టణంలోని ఓటేరు కాలువ, కరిమారియమ్మ ఆలయం వద్ద ఉన్న స్నేహితులు ఆరుగురు నదిలో సరదాగా ఈత కొడదామని వెళ్ళారు. అయితే దురదృష్టవశాత్తు నదిలోని ఓ చోట దిగుతూనే హారూన్ (8) మృతి చెందారు. మరొకరు ఇంటర్‌మీడియట్ చదువుతున్న గుణ (14) గల్లంతైనట్లు సమాచారం. ఆదివారం ఉదయం నుంచి గజ ఈత గాళ్ళను రంగంలో దించారు. శ్రీకాళ హస్తి టౌన్ సిఐగోపి చొరవ తీసుకొని మృతి చెందిన గుణ మృతదేహాన్ని బయటకు తీసారు. పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నిర్వహించి మృత దేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

**సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి:**

శ్రీకాళహస్తీశ్వరాలయం రూ.27కోట్లతో చేపట్టిన శివం టు శివం రోడ్డు నిర్మాణానికి స్వర్ణముఖి నదిలో పనులు నిర్వహించుటకు వరద నీటిని మళ్ళించుటకు నదిలో కాలువలు తవ్వారు. దాంతో ఇటీవల వచ్చిన నీటితో గుంతలు నిండాయి శనివారం ఆరుగురుస్నేహితులు సరదాగా ఈతకు వెళ్ళారు. ఈ సంఘటనలో హారూన్ అనే చిన్నారి మృతి చెందగా మరోకరు గల్లంతు అయ్యారని తెలిపారు. అయితే ఇంత పెద్ద పనులు చేస్తున్నపుడు గుంతలు తవ్వినపుడు ఎందుకు ప్రమాద హెచ్చరికల బోర్డులు,సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదన్నది పట్టణంలో చర్చనీయంశంగా మారింది. ఇప్పటికైనా పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సి ఉంది.

## గోవింద నామాలతో శ్రీవారి 3డి చిత్రం

కుప్పం, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త : తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా కుప్పంకు చెందిన ప్రముఖ కళాకారుడు పురుషోత్తం శ్రీవారి పట్ల తనకున్న భక్తిని చాటుకున్నాడు. గోవింద నామాలతో వినూత్నంగా 3డి చిత్రాన్ని రూపొందించాడు. ఈ చిత్రంలో ఓ పక్క చూస్తే శ్రీవారు, మరో పక్క చూస్తే శ్రీమలయప్పస్వామి, మధ్యలో శ్రీవారి నామం కనిపించేలా అద్భుతంగా గోవింద నామాలతో చి త్రీకరించాడు. ప్రస్తుతం ఈ 3డి చిత్రం వైరల్ అవుతోంది.

## కక్షపూరిత రాజకీయాలకు దూరంగా... సంక్షేమం వైపు



చౌడేపల్లి, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త: చౌడేపల్లి పట్టణ నడిబొడ్డున వున్న బస్టాండులో రాజకాలువ పూడిపోడిపోవడం, అక్కడక్కడ ఆక్రమణలు జరగడం వల్ల వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు 3 దశాబ్దాలుగా స్థానికులు పాలక, అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం కనిపించలేదు. తాజాగా కురిసిన వర్షానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల జలదిగ్బంధమైన విషయం విధితమే. దీంతో చలించిన మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి చొరవ తీసుకొని రాజకాలువ దురాక్రమణలకు అడ్డుకట్ట వేశాడు. కాలువపై వున్న ఆక్రమణలు తొలగించి నీటిని చిట్రెడ్డి చెరువులోకి వెళ్ళేలా చర్యలు తీసుకొంటున్నాడు. ఈక్రమంలో బస్టాండులో గల దివంగత వైఎస్సార్ విగ్రహాన్ని తొలగింపు అనివార్యమయ్యింది. అయితే తొలగించకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాడు. దీంతో స్థానికుల్లో చర్చ మొదలైంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆపార్టీ నాయకులు పట్టుబట్టి మరీ నూతనకాల్వ రామకృష్ణారెడ్డి విగ్రహ వద్దగల తేదేపా జెండాను తొలగించారు. తొలగింపును అడ్డుకొన్న గువ్వల రమేష్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపారు. అయితే తొలగించాల్సిన ఆవశ్యకత వుండి వైఎస్సార్ విగ్రహాన్ని అలానే వుంచి పక్కనే మరో కాలువను ఏర్పాటు చేయడం పట్ల ఆయన కక్షపూరిత రాజకీయాలకు దూరంగా ఉన్నాడనడానికి నిదర్శనంగా చర్చించుకోవడం వినిపించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మండలంలో ఇదే పంథాతో ఆయన ముందుకు వెళుతూ సమకాలిన రాజకీయాలకు ఆదర్శంగా నిలుస్తున్నాడని పరిశీలకులంటున్నారు.

## నిండు కుండలా వైఎస్ఆర్ జలాశయం : కమీషనర్



పలమనేరు టౌన్, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త: పలమనేరుకు తాగునీటి సరఫరా చేసే కౌండిన్య ప్రాజెక్టు వద్ద వైఎఎస్ఆర్ జలాశయం నిండు కుండలా తొణికిసలాడుతోంది. కురుస్తున్న వర్షాలకు రెండు రోజులుగా పూర్తి స్థాయిలో నీరు నిండి జలకళతో ఆకట్టుకుంటోంది. దీంతో మున్సిపల్ కమీషనర్ రమ ణారెడ్డి ఆదివారం జలాశయం వద్దకు వెళ్ళి జలహారతి నిర్వహించారు. 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పలమనేరు మండలం కాలువపల్లె వద్ద అటవీ ప్రాంతంలోని కౌండిన్య నది వద్ద రూ.60 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టుకు శంఖుస్థాపన చేశారు. నదికి అడ్డంగా సుమారు 1 కి.మీ దూరం దాదాపు మూడేళ్ళ పాటు ప్రాజెక్టు నిర్మించి పలమనేరు వరకు 18 కి.మీల దూరం పైపులైన్లు ఏర్పాటు చేసి పనులు పూర్తి చేశారు. 2010లో వైఎస్ రాజశేఖరెడ్డి ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. చుట్టుపక్కల అటవీ ప్రాంతం నుండి వచ్చే వర్షపు నీరు అంతకు ముందు నదిలో చేరి వృధాగా తమిళనాడు రాష్ట్రం పాలారునది చేరేది. ఈ నీటిని సద్వినియోగం చేసుకోవడానికి అప్పట్లో కౌండిన్య ప్రాజెక్టు నిర్మించారు. ప్రాజెక్టు వద్ద నీటిని శుద్ధి చేసి పైప్‌లైన్ల ద్వారా పలమనేరు ఎద్దుల సంతవీధిలోని సంప్‌కు తరలిస్తున్నారు. నీరు నిండడంతో ఇక వర్షాలు లేక పోయినా రెండేళ్ళ పాటు పలమనేరు ప్రజల తాగునీటికి లోటు ఉండదని చెపుతున్నారు.

## శ్రీశక్తి పీఠంలో శ్రీ ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



రామచంద్రాపురం, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త: మహాలయ అమావాస్యను పురస్కరించుకుని రాయలచెరువు సమీపంలోని శ్రీశక్తి పీఠంలో ఆదివారం శ్రీ ముత్యాలమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీశక్తి పీఠం వ్యవస్థాపకులు కుర్తాళం పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద మహాభారతి స్వామి ఆధ్వర్యంలో రమ్యానంద భారతియ ముత్యాలమ్మ వారికి వివిధ రకాల సుగంధద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. 108 కూష్మాండ బలి సమర్పణ, 108 కిలోల తీపి పొంగళి, 108 కిలోల పులిహోర, 108 కిలోల దద్దోజనం, సహస్ర మాస చక్రములు పానక నివేదన ఇవ్వడం జరిగింది. ఆలయ ప్రాంగణంలోని కాళీమాతకు ఘోరపాప నాశన మహాప్రత్యంగిరా హోమం నిర్వహించారు. అనంతరం మాతాజీ భక్తులకు మత్రోపదేశం చేశారు.

# గూడూరు డివిజన్

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



కోట,సెప్టెంబరు 21 ప్రభాతవార్త : ఆరోగ్యవంతులైన మహిళలతోనే బలమైన కుటుంబం అనే నినాదంతో స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ను దేశ వ్యాప్తంగా ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారని తెలుగుదేశం పార్టీ జిల్లా మైనార్టీసెల్ అధ్యక్షులు షెక్ జలీల్‌ఆహ్మద్ చెప్పారు. ఆయన ఆదివారం తన కార్యాలయాలంలో విలేకర్లతో మాట్లాడారు. నేడు సోమవారం కోటలోని సచివాలయం3లో ఉచిత వైద్యశిబిరం జరగనున్నట్లు తెలిపారు. మహిళలకు సంబంధించిన క్యాన్సర్ మరియు మాత శిశు సంరక్షణ సేవలు, షుగర్ బద్ల ప్రెజర్, వంటి వ్యాధులను ప్రారంభ ధశలోనే గుర్తించి వాటికి వైద్య సేవలు అందిచడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో వారికి తొందరగా చికిత్స అందించేందకు వీలు కలుగుతుందన్నారు. నోటి క్యాన్సర్,గర్భాశయ క్యాన్సర్‌లను పరీక్షల ద్వార తగిన వైద్య చికిత్సలను అందిచడం జరుగుతుంద న్నారు. కిషోర్ బాలికలల్లో రక్త హీనత ను గుర్తించి చికిత్సలు అందిచడం, గర్బవతులను పరిక్షించి వారికి సరైన పోషకాహారం ఆవశ్యకతను వివరించడం జరుగుతుందన్నారు. కుటుంబ సౌభాగ్యం ,సమాజ అభివృద్ది మహిళ ఆరోగ్యం మీద ఆధారపడి ఉందని ప్రస్తుత కాలంలో మహిళలు ఇంటిని చూసుకోవడమే కాకుండా విద్య ఉద్యోగం, వ్యాపారం వంటి అన్ని రంగాల్లో ముందజలో ఉన్నందున వారి ఆరోగ్యాన్ని కాపాడటం, ఏంతో అవసరమని జిలీల్ ఆహ్మద్ గుర్తు చేశారు. ముందస్తు నిర్దారణతో క్యాన్సర్ వంటి రోగాలను అదిగమించ వచ్చున్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న స్కీనింగ్ టెస్టులను వైద్యంను ప్రజలు సద్వినియోగించుకోవాలన్నా ఆయన కోరారు. ఈ వైద్య శిబిరాలు వచ్చే నెల 2 వరకు అన్ని సచివాలయాల పరిధిలో జరుగుతాయని ఆయన గుర్తు చేశారు.

## గంజాయి స్వాధీనం నిందితుడు అరెస్ట్ : సిఐ



వెంకటగిరి, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త: పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ఆర్ జీనోజ్ గంజాయి తరలిస్తుండగా పట్టుకొని అరెస్ట్ చేసినట్లు సీఐ ఏవి రమణ తెలిపారు. వెంకటగిరిలోని సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. 11వేల రూపాయలు విలువ కలిగిన ఒకటిన్నర కిలోల గంజాయిని అతని వద్ద నుండి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఒరిస్సా రాష్ట్రంలో గంజాయిని కొనుగోలు చేసి అక్కడ నుండి విజయవాడ స్టేషన్కు వచ్చి, వెంకటగిరి స్టేషన్కు వచ్చి దిగి బస్సులో తిరుపతికి వెళ్లేందుకు వస్తుండగా పట్టుకు న్నట్లు ఆయన వివరించారు. నిందితుడుని అరెస్ట్ చేసి రిమాండ్లకు పంపినట్లు చెప్పారు.

## ప్రశాంతంగా సాధారణ సర్వసభ్య సమావేశం



పాలసముద్రం, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త : పాలసముద్రం మండల ప్రజా పరిషత్ కార్యాలయలో ఆదివారం ఎంపీపీ శ్యామల శివప్రకాష్ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అన్ని శాఖలకు సంబంధించి మండల స్థాయి అధికారులు, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు మరియు సర్పంచులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఇటు ప్రజాప్రతినిధులు అటు అధికారులు అందరూ కలసి మండల అభివృద్ధికి మరియు ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి అదేవిధంగా ప్రజలకు అవసరమైన తాగునీరు, విద్యుత్,రహదారి, పారిశుధ్యం, వైద్య సౌకర్యాలు వంటి మౌలిక వసతులు కల్పించడం మనందరి బాధ్యత అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి మాట్లాడుతూ గతంలో ఇక్కడ పనిచేసిన మండల స్థాయి అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేసిన ప్రతి అధికారికి ప్రభుత్వం అవార్డులు ఇచ్చిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేర్చడం మనందరి బాధ్యత అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి సతీష్, ఎంపీపీ శ్యామల శివ ప్రకాష్, తాసిల్దార్ అరుణ కుమారి, జడ్పిటిసి అన్బు ఆలగన్, అధికారులు మరియు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## జిఎస్టీలో సంస్కరణలకు శ్రీకారం

**- జిల్లా బిజెపి సీనియర్ నాయకులు చిట్టిబాబు కొల్లా**



చిత్తూరు, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం జిఎస్టీలో సంస్కరణలకు శ్రీకారం చుట్టిందని జిల్లా బిజెపి సీనియర్ నాయకులు చిట్టిబాబు కొల్లా పేర్కొన్నారు. చిత్తూరులో ఆదివారం భారతీయ జనతా పార్టీ, చిత్తూరు ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరీ సత్రంలో జిఎస్టీ నూతన సంస్కరణలపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా బిజెపి సీనియర్ నాయకులు చిట్టిబాబు కొల్లా మాట్లాడుతూ వస్తు సేవల పన్ను(జిఎస్టీ) సరళతర విధానంను ప్రధాని నరేంద్రమోడి మార్గదర్శకత్వంలో 56వ జిఎస్టీ కౌన్సిల్ సమావేశం అనంతరం కేంద్ర ప్రభుత్వం నూతన పన్ను రేట్లను సెప్టెంబర్ 22వ తేదీ నుండి అమలులోకి తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. మన సమాజంలో భిన్నమైన ఆర్థిక స్లాబులు వున్నాయని, ప్రజలు వస్తువుల వినియోగంలో భారీ వ్యత్యాసాలు వుంటాయన్నారు. కాలానుగుణంగా ప్రజల రోజువారి వస్తువుల వాడకం మారిందని, అందుకే కేంద్ర ప్రభుత్వం జిఎస్టీలో సంస్కరణలకు శ్రీకారం చుట్టిందన్నారు. చిత్తూరు ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మహేష్ మాట్లాడుతూ జిఎస్టీ సంస్కరణలతో పలు వుస్తువుల పన్ను రేట్లు తగ్గుముఖం పట్టడంతో వినియోగదారుల కొనుగోలు స్థాయి పెరుగుతుంద న్నారు. ఈ సందర్భంగా జిఎస్టీ సంస్కరణలపై బిజెపి నాయకులు చిట్టిబాబు కొల్లా రూపొందించిక కరపత్రంను కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ ప్రసాద్, బిజెపి నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, అట్లూరి శ్రీనివాసులు, రామభద్ర, షంషేర్, ఉదయ్ కుమార్, రెడ్డి మస్తాన్, పాండియన్, రాజేష్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

## క్లీనింగ్‌యంత్రాలు విరాళం



తిరుమల,సెప్టెంబర్ 21ప్రభాతవార్తప్రతినిది: లక్ష మంది భక్తులు వస్తున్నా... టన్నుల కొద్దీ వ్యర్థాలు ప్రోగవుతున్నా ఎప్పటికప్పుడు తొలగించి శుభ్రం చేయడంలో టిటిడికి పారిశుధ్య విభాగం కీలకం. అత్యంత పరిశుభ్ర పుణ్యక్షేత్రంలో తిరుమలకొండ అవార్డు అందుకుంది. శ్రీవారి బ్రహ్మోత్సవాల వేళ భక్తులు రోజుకు 2 లక్షల మంది వరకు కొండపైనే ఉంటారు. భక్తులు వినియోగించి పడేసిన చెత్తాచెదారాన్ని, ఆలయం ముందు, మాఢవీధుల్లో, తిరుమల అంతటా ధుమ్ముకూడా కనిపించకుండా టిటిడి చేస్తున్న కృషికి ఒండు బ్యాంక్‌ల శాఖలు సామాజిక దృక్పధంతో శుభ్రంచేసే యంత్రాలను విరాళంగా అందించాయి. టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి వాహనం నడిపి పరిశీలించారు.

## నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబౌతున్న దక్షిణ కైలాసం



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 21 ప్రభాతవార్త: తిరుపతిజిల్లా శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో దసరా మహోత్సవాలకు ముస్తాబౌతుంది.నేటి నుంచి ప్రారంభమయ్యే ఉత్స వాలకు ఓ వైపు దేవస్థానం, మరో వైపు ప్రైవేటు వ్యక్తులు వివిధ దేవి దేవాలయాల్లో నిర్వహణకు సిద్ధం చేస్తున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న కనకాచలంపై వెలసిన దుర్గమ్మ ఆలయంను దీపాల కాంతితో దేదీప్యమానంగా తీర్చి దిద్దారు. ఇటు పిట్టల వారి వీధి అటు ముత్యాలమ్మగుడివీధుల వైపు నుంచి మెట్లను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. మహిళా భక్తులకు తగిన సదుపాయాలుక ల్పించారు. దేవస్థానం సారధ్యంలో ఆలయంలో వెలసిన జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారి ఆలయంలోనూ, ఎదురుగా బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. అలాగే ఆలయానికి అనుబంధంగా ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో భారీ ఎత్తున అలంకారాలు, పూజలు నిర్వహిస్తారు. కాగా పట్టణ నడిబొడ్డులోని కొత్తపేట శీతలాంబ ఆలయం వద్ద పది రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. అలాగే దక్షిణ కాళి మాత ఆలయం ముస్తాబౌతుంది. శ్రీకాళహస్తిలోని బజారువీధిలో వెలసిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం, బహదూరుపేటలోని అమ్మవారి ఆలయాల్లో దసరా ఉత్సవాలకు సిద్ధం చేసారు.

## ఎన్టీఆర్ సుజల ట్యాంకులకు మోక్షం

కుప్పం, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త: నియోజకవర్గ ప్రజలకు స్వచ్ఛతాగునీరు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ సుజల ప్లాంట్లు, ట్యాంకులకు మరమ్మత్తుల పనులు సాగుతున్నాయి. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ఓ మంచి ఆశయంతో 2014లో ఎన్టీఆర్ ట్రస్ట్ తరఫున మంత్రి నారా లోకేష్ ఎన్టీఆర్ సుజల మదర్ ప్లాంట్‌ను కుప్పం డికెపల్లి చెరువు వద్ద ప్రారంభించారు. అప్పటినుంచి గ్రామాల్లో ట్యాంకులు ఏర్పాటుచేసి ప్రజలకు 2రూ.లకే 20లీటర్ల స్వచ్ఛజలాలు అంది ంచేవారు. అనంతరం వైఎస్సార్సీ ప్రభుత్వం 2019లో అధికారంలో రాగా ఎన్టీఆర్ సుజల ట్యాంకులకు రంగులు మార్చింది. నీటి ధర సైతం రూ 5లకు పెంచింది. అయితే ట్యాంకులు, మదర్ ప్లాంట్ల నిర్వహణ పలుచోట్ల సక్రమంగా లేకపోయింది. ప్రస్తుతం మరలా ట్యాంకుల మరమ్మతు పనులతో పాటు కొత్తగా వాటికి పెయింటింగ్ సైతం చేయిస్తున్నారు. ఈ విషయంగా ఆర్‌డబ్ల్యు ఎస్ డిఇ పురుషోత్తం 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాలతో ఎన్టీఆర్ సుజల టా ్యంకులు మరమ్మత్తులు చేయిస్తున్నట్లు తెలిపారు. కుప్పం పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఎన్టీఆర్ సుజల శుద్ధజలాలు త్వరగా అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.